


పంచాననరాయ్ చౌదరి

సీతారాం రాజ్యభ్రష్టుడై మూడేళ్ళయింది.

ఫాల్గుణమాసంలో ఒకనాటి సాయంకాలం. హరిద్వారానికి వాయువ్యదిశగా, ఎనిమిదికోసుల దూరంలో హిమాలయాల దిగువన, నాలుగు కొండల మధ్యగల సమప్రదేశంలో ఒక ఆశ్రమం. అందులో అనేక చిన్న కుటీరాలు. పులి చర్మాల పైన కూర్చుని జయంతీ, ఎనభై ఏళ్ళ వృద్ధుడైన రామానందస్వామీ మాట్లాడుకుంటున్నారు. ఆ ఆశ్రమం రామానందస్వామిది. కుటీరాలలో ఆయన శిష్యులుంటారు.

"ప్రపంచాన్ని పరిత్యజించి, నీ ప్రేమానురాగాలను ఈశ్వరుడికి అర్పించిన

దానివి తిరిగి ప్రపంచంతో సంబంధం ఎందుకు పెట్టుకున్నావు?" అని స్వామి జయంతినడిగాడు

"స్వామీ! శ్రీని చూడగానే నాలో ఆత్మీయత మొలకెత్తి, ఆమెకు సుఖం చేకూర్చ బుద్ధిపుట్టింది." అన్నది జయంతి.

"అందువల్ల ఏంలాభం కలిగింది ? నీ బుద్ధి నిష్కళంకం కాలే దింకా;"

"నిజమే. నాకు మాత్రం ఒక్కటి చాలా ఆశ్చర్యం కలిగించింది. సీతారాంవంటి జ్ఞానీ, ఉత్తముడూ అకస్మాత్తుగా నీచుడుగా పరిణమించి, ఎందుకు పతనమయాడు?"

"ఎంత జ్ఞాని అయినా స్త్రీసౌందర్య విమోహితుడైతే జ్ఞానమాన్యు డవుతాడు. ఆ వ్యామోహమే సీతారాంను పతితుణ్ణి చేసింది. అతని ఆత్మీయులు అతన్ని కాపాడ బోయి తామే నాశనమయారు ఇంతకూ, హిందువుల పతనమూ, ముసల్మానుల అభ్యుదయమూ విధి లిఖితమై ఉంది. అందుకే సీతారాం స్థాపించదలచిన హిందూ రాజ్యం భగ్నమయింది. శ్రీ ఇప్పు డెక్కడ ఉంది?"

"నావెంట ఆమె నిక్కడికి తీసుకురావటానికి జంకి, కంఖాలలో మీ శిష్యుడు బ్రహ్మానంద మిశ్రుడి యింట ఉంచి వచ్చాను."

"మంచిది. ఒకసారి నే నామెను చూడాలి. నువే వెళ్ళి ఆమె నిక్కడికి తీసుకురా "

జయంతి మర్నాడు తెల్లవారుజామునే ఆశ్రమం నుంచి బయలుదేరి కంఖాలకు వచ్చింది. కంఖాల హరిద్వారానికి దగ్గరలోనే ఉన్నది. అక్కడ హరిద్వారపు పండాలూ, పవిత్ర జీవితాలు గడిపే బ్రాహ్మణులూ ఉంటారు. వారిలో బ్రహ్మానంద మిశ్రు డొకడు. ఆయనకు సంసారబంధా లేవీ లేవు. చాలా కాలం క్రితమే భార్య పోయింది. ఒక్క కుమార్తె అత్తవారింట కాపరం చేసుకుంటున్నది

జయంతి మిశ్రుడితో, "గురుదేవుడు అక్కను ఒకసారి చూడా లంటున్నారు. ఆశ్రమానికి తీసుకుపోతాను." అన్నది.

"మీ అక్క చాలా దొడ్డమనిషి. ఆమె ఇంట్లోఉంటే నా కూతురు సుబాల ఉన్నట్టే ఉన్నది. ఆమె పతిసేవ చేసుకోక వైరాగ్య జీవితం ఎందుకు గడుపుతు న్నదో నా కర్థం కాలేదు ఆడది తరించటానికి భర్తను సేవించటాన్ని మించిన సులభోపాయం లేదు. ఆమెనడిగితే తన చరిత్ర ఏమీ చెప్పింది కాదు. నీకు తెలిసే ఉంటుంది, కాస్త చెప్పు." అన్నాడు బ్రహ్మానంద మిశ్రుడు.

జయంతి ఆయనకు శ్రీని గురించిన కథ యావత్తూ చెప్పసాగింది. శ్రీకి భర్త ఉండి కూడా, నారీజన్మ సార్థకం కాకపోవటమూ, ఎనిమిదో ఏట ఆమెకు

సీతారాంతో వివాహం కావటమూ, ఆమె జాతకఫలం విని సీతారాం ఆమెను త్యజించటమూ. ఆమె తండ్రి ఇంట ఉండగా మొదట తండ్రీ, తరవాత తల్లీ పోవటమూ, తన అన్న అయిన గంగారాంకు మరణదండన విధించబడినప్పుడు ఆమె సీతారాం సహాయం అర్థించటమూ. సీతారాం ఆమె సౌందర్యానికి విమోహితుడై ఆమె అన్నను కాపాడటమూ. అధికారులు సీతారాంను శిక్షించబోతున్న సమయంలో శ్రీ చెట్టుపైనుంచి జనాన్ని రెచ్చగొట్టి, వారి చేత ముస్లిములను చంపించటమూ మొదలైన విషయాలు చెబుతూన్న సమయంలో శ్రీ వచ్చింది.

శ్రీ ఇప్పుడు పూర్వం కంటె కొంచెం చిక్కిఉన్నది, కాని ఆమె సౌందర్యంలో ఎలాటి వంకాలేదు.

"ఇక్కడ నీకు సుఖంగా ఉన్నదా ?" అని జయంతి శ్రీని అడిగింది:

"ఇక్కడ ఉన్నంత సుఖం నేను పూర్వమెన్నడూ ఎరుగను. ప్రపంచంలో ఇంత ప్రశాంత ప్రదేశం మరొకటుంటుందనుకోను. మిశ్ర మహాశయుడు మహాసజ్జనుడు. నన్ను తన కూతురిలాగా చూసుకుంటున్నాడు." అన్నది శ్రీ.

"నేనిప్పు డెందుకు వచ్చానో తెలుసా ? అదృష్ట దేవతకు నీపైన యింతకాలానికి అనుగ్రహం కలిగింది. త్రికాలజ్ఞుడైన గురుదేవుడు నిన్ను చూడగోరుతున్నాడు. ఆయన ఆశ్రమానికి వచ్చావంటే భక్తిపారవశ్యంలో మునిగి మైమరచి పోతావు." అన్నది జయంతి.

ఆమాట వినగానే శ్రీ ముఖంలో సంతోష చిహ్నాలు కనిపింఛాయి. అయితే ఆమె పైకేమీ అనకుండానే, వంటచేయాలని వంట ఇంట్లోకి వెళ్ళింది.

ఆ రాత్రి జయంతీ, శ్రీలు ఫలహారంచేసి పడుకుని నిద్రపోయి. మర్నాడు తెల్లవారుజామున రామానందస్వామి ఆశ్రమానికి బయలుదేరారు.

కొంతదూరం వెళ్ళాక జయంతి శ్రీతో. "ఒకప్పుడు మనమిద్దరము ఇలాగే నిర్జనమార్గాన ప్రయాణంచేశాం. జ్ఞాపకముందా ?" అని అడిగింద.

"వైతరణీ ప్రాంతంలో నిన్ను మొదటిసారి కలుసుకున్నప్పటి విషయాలు ఏవీ మరిచిపోలేదు." అన్నది శ్రీ.

"అప్పు డొక గుహలో ఉన్న ఒక మహాపురుషుడు నీ చెయ్యి చూశాడు "

"అవును. గంగాధరస్వామి. నా కాయనపైన ఎంతో భక్తి."

"ఆ గంగాధరస్వామి మన మిప్పుడు వెళ్ళే ఆశ్రమంలో ఉన్నాడు. నేనూ. గంగాధరస్వామి కూడా రామానందస్వామీ శిష్యులమే. గంగాధరస్వామి గురుదేవుడి

ఆశ్రమంలోనే ఉంది. భగవంతుణ్ణి ప్రత్యక్షంగాచూసే రహస్య తత్వాలలో ఉపదేశం పొందుతున్నాడు." అన్నది జయంతి.

"నీకూ, గంగాధరస్వామికీ గురువంటే. ఆయన సామాన్య పురుషుడై ఉండడు. నీ దయవల్ల నాకాయనదర్శనం లభించబోతున్నది. పూర్వజన్మలో మనం ఒకతల్లి బిడ్డలమై ఉండాలి. లేకపోతే నాకోసం ఇంత ప్రయాస ఎందుకు పడతావు?" అన్నది శ్రీ.

"అది నువ్వనవలసిన మాటకాదు. నువ్వెవరూ, నేనెవరు అని ఆలోచిస్తే ప్రపంచలో ఉన్న స్త్రీ పురుష లందరూ మనవాళ్ళే. కాని నా ప్రాణానికి ఆత్మీయులెవరూలేరు. సత్సాంగత్యంతో నువుకూడా చంచలమైన మనస్సును స్వాధీనానికి తెచ్చుకున్నావు. ప్రపంచ ధర్మం ఎలా ఉంటుందంటే. అయినవాళ్ళనుకున్న వాళ్ళు క్షణంలో దూర మవుతారు మొహం తెలియని వాళ్ళు ఆప్తమిత్రు లవుతారు. నీకు అందరికన్న సన్నిహితుడుగా వుండవలసిన నీ భర్త నిన్నుత్యజించాడా, లేదా? ఆయన కన్న నేను నీకు దగ్గిర దాన్నయానా, లేదా?"

"అందుకే అందరినీ విడిచిపెట్టి పారిపోయి నిన్నాశ్రయించాను. ఆడది దావానలాన్నయినా కడుపులో దాచుకుంటుంది. కాని మగవాళ్ళు క్షణచిత్తులు. ఏ క్షణంలో వారిమనస్సెటు పోతుందో చెప్పలేం. అలాటి వాళ్ళను విడిచిపెట్టక చేసేదేమున్నదీ?"

"కాని, నీకు జ్ఞాపకం ఉన్నదా? నిన్ను నీ నాధుడికి నాధుడైన ఈశ్వరుడిపైన మనస్సు నిలుపుకో మన్నాను. అప్పుడు నువు, 'ఈశ్వరుడు నా నాథుడికి నాథుడేమో గాని, నాకు కాడు!' అన్నావు. ఆ మాట విని. నువు మాయనుంచి బయట పడలేవనుకున్నాను."

"ఆ శ్రీ ఏనాడో పోయింది. నువు నన్ను మార్చేశావు. మహమ్మదుపురంలో తిరిగి హిందూరాజ్యం ఏర్పడిందని విన్నప్పటికీ నాలో ఎలాటి వికారమూ కలగదు. ఎవణ్ణి ప్రాణంకన్న హెచ్చుగా ప్రేమించి, ఎవడికి ఆపదలు రాకుండా చూడటమే జీవితలక్ష్యంగా పెట్టుకున్నానో అతనికి అందువల్లనే భయమేర్పడితే ఇక చేసేదేమిటి? ఐహిక సుఖాలపై ఆశ ఇలాగే ఉంటుంది."

"అయితే ఆ చివరిరోజు నువ్వతనికి పత్నిగా ఉండటానికి ఒప్పుకున్నావు నిన్నతను 'పట్టమహిషి' అని సంబోధించాడు. నువు పరమానందంతో అతని పాదధూళి శిరస్సున ధరించావు. జ్ఞాపకం ఉందా?"

"హృదయోద్వేగాన్ని ఆపుకోలేక అలా చేసినమాట నిజమే. అందుకోసం

పశ్చాత్తాపం చెంది, నా హృదయం దహించుకుపోయింది. నా హృదయం ఉద్వేగం చెందటానికి కారణాలు లేకాపోలేదు. గంగాధరస్వామి ఆజ్ఞ నేరవేర్చటానికే నే నక్కడికి వెళ్ళాను, వెళ్ళి రాజ్యం ధ్వంసం అవుతూండటమూ, మహారాజు పాప పంకిలంలో కూరుకుపోయి ఉండటమూ చూశాను. అందువల్ల నాకు మతి చెడి పోయింది. నేను దిగజారిపోయాను, కాని ఫలితం మాత్రం దక్కలేదు "

"మనం మహమ్మదు పురానికి వెళ్ళేటప్పుడు నువు నీవల్ల నీ భర్తకు ప్రాణ హాని జరుగుతుందన్న భయంకూడా లేకుండా మాట్లాడావు. చావు మనచేతిలో లేదనీ, నీ భర్త చావుకు నువే కారణం కావాలని రాసిపెట్టి ఉంటే అలాగే జరగ నిమ్మనీ అన్నావు. అప్పుడు నువ్వన్న మాటలు విని నే నెంతో సంతోషించాను. అలాటి దాని విప్పుడు ఫలితం దక్కలే దని ఎందుకు విచారిస్తావు? నీ మనసు మారి పోయి ఉంటే నీ భర్త వద్దకు వెళ్ళి భార్యా ధర్మం నిర్వర్తించు. నీ భర్త నిన్ను తప్పక స్వీకరిస్తాడు."

నా కిప్పు డలాటి కోరిక లేవీ లేవు. నేను భారమంతా భగవంతుడిపైన ఉంచి, నిశ్చింతగా ఉన్నాను. ప్రపంచంలో నిజంగా స్వార్థం లేనివా రెవరూ లేరు. భగ వంతుణ్ణి వదిలి మనుష్యులను నమ్ముకోవటం వృథా."

ఇలా మాట్లాడుకుంటూ వా రిద్దరూ మధ్యాహ్నం దాకా నడచి, ఆ రోజుకు ఒక పాంథశాలలో విశ్రాంతి తీసుకుని, మర్నాడు మళ్ళీ నడక సాగించారు. వాళ్ళు దారి పొడుగునా తాత్విక విషయాలు మాట్లాడుకుంటూ ఒకనాటి రాత్రికి పుణ్యాశ్రమం చేరారు. ఆ రాత్రి వారు రామానందస్వామి దర్శనం చేసుకోలేదు. శ్రీ జయంతి ఉండే కుటీరంలోనే పడుకున్నది.

## 2

నది ఒకచోట ఒడ్డును కోస్తే మరొకచోట మేటవేస్తుంది. మహా సామ్రాజ్యాలు మట్టిలో కలిసిపోయి, కొత్త సామ్రాజ్యా లవతరిస్తాయి. అలా జరగడానికి గల కార ణాలు తెలుసుకోవటం మానవుల అల్పబుద్ధికి సాధ్యం కాదు.

క్రూరుడూ, చపలుడూ అయిన ఔరంగజేబు పరిపాలించే కాలంలో మొగలాయీ సామ్రాజ్యం అత్యున్నత స్థితిలో ఉంది. కాని దాని పతనం కూడా అప్పుడే ఆరంభ మయింది. సామ్రాజ్యంలో చేరి ఉండిన చిల్లరరాజ్యాలు స్వతంత్రం కోసాగాయి. సుబేదారులు రాజవిద్రోహు లయ్యారు. చిన్నచిన్న స్వతంత్రరాజ్యాలు కుక్క గొడుగులలాగా తల లెత్తాయి.

ఈ కథ జరిగేనాటికి ఔరంగజేబు మనవడు మహమ్మద్‌షా ఢిల్లీలో పాదుషాగా ఉన్నాడు చిన్నతనం నుంచీ అతను భోగలాలసుడు అతనిలో రాజోచితలక్షణాలేవీలేవు. అతని కింది ఉద్యోగులు అతన్ని కీలుబొమ్మనుచేసి ఆడించసాగారు. వారి బారినుంచి తప్పించుకోవటాని కతను తనకు మంత్రిగా ఉండమని అసఫ్‌జాకు కబురు చేశాడు.

అసఫ్‌జా వివేకమూ, జ్ఞానమూ, రాజనీతీ గల సమర్థుడు. సాధారణంగా ఉమ్రావులలాగా విలాసపురుషుడు కాడు. ఆ కాలపు మహమ్మదీయులలో అతని కన్న సమర్థుడులేడని చెప్పవచ్చు. అతను దక్షిణదేశంలో తన సొంత రాజ్యం ఏర్పరచుకుని నిజాం అనే పేరుతో పరిపాలిస్తున్నాడు. మహారాష్ట్రులే విజృంభించి అడ్డు తగలకపోతే భారతదేశమంతటినీ ఏకచ్ఛత్రంగా పాలించి ఉండదగినవాడు. మొగలాయీల పేరుకూడా లేకుండాపోయిన తరవాతకూడా ఇతని వంశస్థులు నిజాములనే పేరుతో రాజ్యం ఏలారు.

ఢిల్లీ పాదుషాను శత్రువుల బారినుండి కాపాడటానికి అసఫ్‌జా ఢిల్లీవచ్చాడు. పాదుషా అయిన మహమ్మదుషా అతనికి మంత్రిపదవి నిచ్చి గౌరవించాడు.

ఢిల్లీ పాదుషాకు గల శత్రువులలో మహారాష్ట్రులను మించినవారు లేరు. వారి పేరు వింటేనే పాదుషా గడగడలాడేవాడు. తనకు తగిన మంత్రి ఉన్నట్టయితే మహారాష్ట్రులనుంచి కాపాడగల డనుకునే వాడు. మహారాష్ట్రుల విజృంభణచూసి చాలామంది, భారతదేశమంతా ఎప్పటికైనా వారి అధీనమే అవుతుందనుకున్నారు.

మహారాష్ట్రులలో ఒక మహాపురుషు డుండేవాడు. అతను బాజీరావుపీష్వా. ఛత్రపతి శివాజీ మరణించిన తరువాత బాజీరావులాటి వీరుడూ, రాజనీతి గలవాడూ మహారాష్ట్రులలో మరొకడు లేడు. అతని నాయకత్వమూ, శిక్షణా కారణంగానే మహారాష్ట్రులంత ఉన్నతికి వచ్చారు. అతను బ్రాహ్మణకులంలో జన్మించికూడా చిన్నతనం నుంచీ రణవిద్య అభ్యసించాడు, మహావీరుడుగా ఖ్యాతి గడించాడు.

పీష్వాలు ప్రధానమంత్రులు. ఆ పదవి వారికి వంశపారంపర్యంగా ఉండేది. తన ముసలితండ్రి చనిపోయాక బాజీరావు పీష్వా అయాడు. రాజు అసమర్థుడు, స్త్రీలోలుడు; మహమ్మదీయ నవాబులలాగే భోగలాలసుడు. కాని బాజీరావు అలాటివాడు కాడు. అతను చిన్నతనంనుంచీ యోధుడు. నాలుగు రోజులు విడవకుండా గుర్రం మీద ఉండగలవాడు. అతిసాధారణమైన భోజనమే తీసుకునేవాడు. విలాసాలంటే అసహ్యపడేవాడు. అతనికి ఒకటే లక్ష్యం: ముసల్మానులను పడదోసి, మహారాష్ట్రులకు అభ్యుదయం చేకూర్చాలని. దేశాభిమానమూ, ఓర్పూ, పరాక్రమమూ



గల బాజీరావు నాయకత్వాన్ని మహారాష్ట్ర దేశం యావత్తూ ఆమోదించింది. సైన్యమంతా అతని వెనక నిలబడింది. బాజీరావు పేరు దేశచరిత్రలో సువర్ణాక్షరాలలో లిఖించదగినది. అతని కీర్తి ఎప్పటికీ మాయదు.

బాజీరావు కింద నలభై వేల అశ్వికసైనికు లుండేవారు. అతని కిందనే శిక్షణ పొందిన వీరందరూ మహాశూరులు, రణకుశలులు. ప్రభుభక్తి గలవారు, అమిత సాహసం గలవారు. వాళ్ళ సహాయంతో దేశంలోఉన్న అందరు హిందూ, ముస్లింలవద్ద బాజీరావు "చౌధ్" అనే పన్నువసూలు చేశాడు. ఆ పన్ను ఇవ్వం అనటానికి ఎవరికీ ధైర్యం ఉండేదికాదు; ఎవరైనా సాహసించి చౌధ్ ఇవ్వ నిరాకరిస్తే త్వరలోనే బాజీరావు వారి రాజ్యాన్ని మట్టిపాలు చేసేసేవాడు.

మహారాష్ట్రుల ఆధిపత్యానికి అసఫ్‌జా తలవంచలేదు. చౌధ్ చెల్లించలేదు. అందుకని బాజీరావు తన సైన్యాలను నిజాం రాజ్యం మీదికి పంపాడు. వాళ్ళువెళ్ళి

అనేక గ్రామాలను మట్టుపెట్టి, అనేక వేలమందిని చంపి, నలభై లక్షల రూపాయల రొక్కమూ, కోటి రూపాయల విలువచేసే వస్తువులూ కొల్లగొట్టుకుపోయారు. అసఫ్‌జా ఢిల్లీకి వెళ్ళిఉన్న సమయంలో ఈ దుర్ఘటన జరిగింది. వఠాను సైనికులలో ఎక్కువమంది అతని వెంటనే ఉండిపోయారు. అందుచేత మహారాష్ట్రి సైనికులు అడ్డేవారు లేకుండా, దక్షిణంగా ఉన్న ప్రాంతమంతా యథేచ్ఛగా కొల్లగొట్టారు. కొల్లగొట్టిన ద్రవ్యంతోసహా బాజీరావు మహారాష్ట్రానికి తిరిగిపోతూ, కొల్హాపూరువద్ద శిబిరం వేశాడు.

ఒక అందమైన గుడారంలో బాజీరావు ఒంటరిగా కూర్చుని ఉన్న సమయంలో ద్వారపాలకుడొకడు వచ్చి, ఆయన దర్శనార్థం ఎవరో వచ్చినట్టు చెప్పాడు.

"ఎక్కడి నుంచి వచ్చాడు ? ఎందుకు వచ్చాడు ?" అని బాజీరావు అడిగాడు.

"బెంగాలు దేశంనుంచి తమరి దర్శనం కోసం వచ్చానంటున్నాడు." అన్నాడు ద్వారపాలకుడు.

"హిందువా ? ముసల్మానా ?"

"హిందువుడే బెంగాలీ వాడిలా గున్నాడు."

"ఒకడే వచ్చాడా ? లేక, వెంట ఇంకెవరైనా ఉన్నారా ?"

"ఒక్కడే వచ్చాడు. వెంట మరెవరూ లేరు."

"మంచిది లోపలికి పంపించు."

బాజీరావుకు రకరకాల ఆలోచనలు వచ్చాయి. బెంగాలు, బీహారు, ఒరిస్సాల సుబేదారుకు శత్రువైనవా దెవడైనా తన సహాయం కోరుతూ దూతను పంపాడేమో ! బెంగాలు సంపత్సమృద్ధమైన దేశమని చెబుతారు. ఈ వచ్చిన మనిషి ద్వారా తన ఆశ ఫలించవచ్చు. అత నిలా ఆలోచిస్తూండగా ద్వారపాలకుడు ఒక మనిషిని లోపకి తెచ్చి, వెళ్ళిపోయాడు. ఆ వచ్చిన మనిషి ఒడ్డూ, పొడుగూ ఉండి మంచి తేజస్విగా కనిపించాడు. వయసు సుమారు యాభై ఏళ్ళుంటుంది. మంచి బంగారు రంగు, పెద్దకళ్ళు. వాటిలో చురుకున్నది. ఒత్తయిన కనుబొమలు. విశాలమైన నుదురు. రాజులు ధరించే తిలకం ధరించాడు. అతని ఆజానుబాహులూ, ప్రశాంతగంభీరమైన ముఖమూ మొదలైనవి చూసి, అనుభవశాలి అయిన బాజీరావు, ఆ మనిషి ప్రచ్ఛన్నంగా ఉన్న మహాపురుషుడై ఉంటా డనుకుని, తనకు దగ్గరగా కూర్చో బెట్టుకున్నాడు.

బాజీరావు వయస్సు అప్పటికి నలభై మించదు. అతను మామూలు మహారాష్ట్రుల

తన్న కొంచెం ఎత్తయినవాడు. మంచి శరీరచ్ఛాయ. చూడిటానికే అసాధారణ ప్రజ్ఞావంతుడుగా కనిపిస్తాడు.

"మీ వాసస్థలమేది ?" అని బాజీరావు అడిగాడు.

"తూర్పు బెంగాలు,"

"మీ పేరు ?"

"రఘునాథరాయలు,"

"మీ వంశం ?"

"నేను కాయస్థవంశానికి చెందిన సామాన్య వ్యక్తిని."

"బెంగాలీలా ?"

"చిత్తం."

"మీరే వృత్తిలో ఉండేవారు ?"

"మొదటి నుంచీ సైనిక వ్రతం అవలంబించిన వాణ్ణే. ఖడ్గమే నాకు జీవనోపాధి."

బాజీరావు నవ్వి, "బెంగాలీలకు కత్తికన్న కలంపైనే మోజేమో ?" అన్నారు.

రఘునాథుడి ముఖం ఒక్కసారి జేవురించింది. అతను తన రోషాన్ని విగ్రహించుకుని, "మీ దేశీయులు కృత్రిమ నాగరికత అలవరుచుకుని ఆత్మగౌరవం కోల్పోతుండటం చేతనే తమ రలా అన్నారు. కాని దేవుడు రాజపుత్రులనూ, మహారాష్ట్రులనూ, శిక్కులనూ సృష్టించినట్టే బెంగాలీలను సృష్టించాడు. వారిలో కూడా శక్తీ, ప్రతిభ, శౌర్యమూ వివేకమూ ఉన్నవా రున్నారు వాడని కత్తి తుప్పుపట్టినట్టు, అభ్యాసం లేక వారు పౌరుషహీను లవుతున్నారు. నేను బాల్యం నుంచీ వీర ధర్మాన్ని చేపట్టినవాణ్ణి. పెద్ద ఖ్యాతి లేకపోయినా, యుద్ధంలో ఎన్నడూ వెన్నుచూపిన వాణ్ణి కాను. కత్తిపట్టి సేవ చెయ్యటానికీ, యుద్ధరంగంలో ప్రాణాలర్పించటానికీ సిద్ధంగా ఉన్నాను,'' అన్నాడు.

"చాలా సంతోషం. నువు సాహసంగల వీరపురుషుడ వనటానికి సందేహం లేదు. ఇంతకుముందు ఏ ముసల్మాను సుబేదారుకింద పనిచేశావు ?" అన్నాడు బాజీరావు.

"నేనే ముసల్మానుకిందా పనిచెయ్యలేదు."

"మరెవరివద్ద పనిచేశావు ?"

"సీతారామ రాయలకింద సర్వసేనానిని."

"ఆ మహారాజా రాజధాని ఏది ?"

"తూర్పు బెంగాలులో మహమ్మదుపురం."

"హిందూ రాజధానికి అదేం పేరు?"

"మహారాజు ఈ నగరాన్ని స్వయంగా నిర్మించాడు. కాని ముసల్మాను సుబేదారుకు తృప్తికరంగా ఉంటుందని ఆ పేరు పెట్టాడు.

"మహారాజు నెందుకు విడిచిపెట్టి వచ్చావు?"

"రాజధాని మహమ్మదీయుల వశమయింది. నేను ఎంత ప్రయత్నించికూడా వారిని ఆపలేకపోయాను."

"మీ మహారాజిప్పుడెక్కడ ఉన్నాడు?"

"నాకు తెలియదు. రాజధానిని ముసల్మానులాక్రమించగానే తన పరివారంతో సహా ఎక్కడికో వెళ్ళిపోయాడు. తరవాత ఆయన జాడలేదు."

"నా సహాయంతో ముసల్మానులను జయించి మీ మహారాజుకు రాజ్యం తిరిగి ఇప్పించాలని నీ ఉద్దేశమా? అందుకే ఇంతదూరం వచ్చావా?"

"లేదు. అందువల్ల నాకేంలాభం? మహమ్మదీయులది పైచెయ్యిగా ఉండగా వారితో తలపడటం రాతిని చేత్తో గుద్దటంలాంటిది"

"అయితే నన్నెందుకు చూడవచ్చావు?"

"మీవద్ద సేవకుడుగా పని చెయ్యటానికి. నేను నీచసేవ చెయ్యలేను. అల్ప ప్రయోజనానికి నా కత్తిని అంకితం చెయ్యలేను. ఎవడైనా మహాపురుషుడు కనిపిస్తే అతడికింద సేవచేద్దామని నిశ్చయించుకుని, ముందు ఢిల్లీ వెళ్ళాను. అక్కడి ప్రభువులందరూ భోగలాలసులుగా కనిపించారు. వారు వీరులుకారు. వీరులను గుర్తించనూ లేరు. నా కక్కడ ఉండ బుద్ధిపుట్టలేదు."

"నిజం. నువు వెళ్ళిన సమయంలో ఢిల్లీ ఎలా ఉన్నది?"

"చాలా దౌర్భాగ్యస్థితిలో ఉన్నది. త్వరలోనే సామ్రాజ్యం మొగలుల చేతినుంచి జారి మహారాష్ట్రుల చేతిలో పడుతుం దనిపించింది."

"ఎందుకలా అనిపించింది?"

"పాదుషాలో రాజలక్షణం ఒక్కటీలేదు. అతను రాజ్యంచెయ్యలేడు. చెయ్యబోడు. ఢిల్లీ పరిస్థితి కళ్ళారా చూశాక మొగలులకు భూమిపైన నూకలు చెల్లాయనిపించింది."

"పాదుషాను నడిపించటానికి సమర్థుడైన మంత్రి ఉన్నాడటగదా?"

"అది వట్టిమాట. నీరుకూ, నిప్పుకూ పొత్తు ఎలా కుదురుతుంది? పాదుషాకూ

అసఫ్‌జాకూ అతకలేదు. త్వరలోనే అతను తన సొంతరాజ్యానికి సపరివారంగాతిరిగి పోబోతున్నాడు."

ఈ మాటవిని బాజీరావు పరమానంద భరితుడయ్యాడు అసఫ్‌జా ఢిల్లీ వదలిపెట్టి వెళ్ళిపోతే బాజీరావు నెదుర్కొ-గలవాడు ఢిల్లిలో మరి ఉండడు. ఆయన రఘునాథుడితో " నీయిష్టంవచ్చిన పదవిలో ప్రవేశించు." అన్నాడు.

ఈ రఘునాథుడని మారుపేరుపెట్టుకుని, మారువేషంతో ఉన్నవ్యక్తి ఎవరో సులభం ఊహించవచ్చు. అతని అసలుఅవతారం త్వరలోనే బయటపడి తీరుతుంది.

# 3

ఆశ్రమానికి చేరిన మర్నాడు శ్రీ రామానందస్వామి దర్శనంచేసుకుని. ఆయనకు భక్తితో నమస్కరించి. ఆయన ఆజ్ఞాపించగా ఆయన సమీపంగా కూర్చున్నది. గంగాధరస్వామి కూడా అక్కడికి వచ్చాడు. శ్రీ ఆయనను అదివరకే ఎరుగును గనక ఆయనకుకూడా నమస్కరించింది. శ్రీ జయంతితోసహా గుహనుంచి వెళ్ళిపోయిన అనంతరం జరిగిన సంఘటనలను గంగాధరస్వామి శ్రీని అడిగి తెలుసుకున్నాడు.

అంతా చెప్పి శ్రీ, "నేను నా భర్తవద్దకు వెళ్ళకపోయినట్టయితే ఆ దుస్సంఘటనలు జరిగేవికావు. అవి జ్ఞాపకం వచ్చినప్పుడల్లా నాహృదయం దహించుకుపోతున్నది." అన్నది.

"పిచ్చిదానా, ఈశ్వరేచ్ఛ లేకుండా అవన్నీ జరిగాయా? భగవంతుడు నిన్ను సాధనంగా ఉపయోగించుకుని నీభర్తకు పతనమూ. ముసల్మానులకు విజయమూ చేకూర్చాడు." అన్నాడు గంగాధరస్వామి. తాను ముందుగా చెప్పినవిషయాలన్నీ చెప్పినట్టే జరిగాయని కూడా ఆయన జ్ఞాపకంచేశాడు.

తరవాత రామానందస్వామీ. గంగాధరస్వామీ కలిసి శ్రీ జాతకఫలితాన్ని గురించీ — మహారాణియోగం ఉండికూడా ఏవిధమైన గ్రహదోషంచేత అది తప్పిపోయిందీ చర్చించుకున్నారు.

జయంతి ఎందుకు సన్యాసిని అయిందో. ఆమెకథ ఏమిటో తెలుసుకోవాలని శ్రీ కోరింది. అది పరమరహస్యమనీ, ఆ విషయాలు జయంతికిసైతం తెలియగూడదనీ. రాత్రి ఒకజాముగడిచాక ఒంటరిగా తనవద్దకువస్తే ఆ వివరాలు చెబుతాననీ రామానందస్వామి శ్రీతో అన్నాడు.

ఆప్రకారమే శ్రీ ఆరాత్రి జయంతికి నిద్రపట్టగానే ఆమె కుటీరంనుంచి బయలు

దేరి రామానందస్వామి వద్దకు వచ్చింది. అప్పు డాయన శ్రీకి జయంతివృత్తాంతం చెప్పాడు.

రామానందస్వామి శిష్యులలో గృహస్థు అయినవాడు ఒకే ఒకడున్నాడు. ఆయన పేరు మల్హారిరావు. ఆయన శివాజీ మహారాజా నిర్మించిన రాయదుర్గంలో నివసించేవాడు. ఆయన జీవితంలో ఒకే లోటు–ఆయనకు సంతానంలేదు. ఒకసారి రామానందస్వామితో కలిసి ద్వారకకు పోతూ మల్హారిరావు తన విచారాన్ని గురువు గారికి తెలిపాడు. ద్వారకనాధుడికి మొక్కుకోమన్నాడు రామనందస్వామి. మల్హారి రావు అలాగే మొక్కుకుని, తనకిద్దరు పిల్లలు కలిగినట్టయితే మొదటిబిడ్డను ఈశ్వరసేవకు అంకితం చేస్తానన్నాడు.

ఇది జరిగిన నాలుగేళ్ళకు మల్హారిరావు రెండున్నర సంవత్సరాల ఆడపిల్లను తీసుకుని ఈ ఆశ్రమానికే వచ్చి, "మీ దయవల్ల నా కోరిక తీరింది. ఈ ఆడపిల్ల నా తొలిసంతానం. ఈమె తరవాత ఒక కొడుకు పుట్టాడు. ప్రథమసంతానాన్ని మీ సేవకు వినియోగిస్తానని మనసులో అనుకున్నాను. ఈశ్వరమాయచేత నాకు మొదట ఈ ఆడపిల్ల కలిగింది. ఏమైనా మొక్కు చెల్లించితీరాలి. ఇక ఈ బిడ్డ నాదికాదు. మీదే." అని రామానందస్వామికి ఆ శిశువు నర్పించాడు.

రామానందస్వామి ఆ బిడ్డను బ్రహ్మానందమిశ్రుడికిచ్చి పెంచమన్నాడు. బ్రహ్మానంద మిశ్రుడుకూడా రామానందస్వామి శిష్యుడే. అప్పటి కాయనభార్య జీవించే ఉన్నది ఆమె తన కూతురితోబాటు ఈబిడ్డనుకూడా పెంచింది. రామానంద స్వామిచేత జయంతి అని నామకరణంపొంది, ఆ బిడ్డ కంఖాలలో పెరుగుతూ, తన పెంపుడు తండ్రివద్ద సంస్కృతమూ, తర్కమూ, వేదాంతమూ నేర్చుకుని, పదిహేడేళ్ళకే బాలప్రవీణ అయిపోయింది.

తరవాత రామానందస్వామి ఆమెకు సన్యాసం ఉపదేశించి, సకల తీర్థాలూ సేవించిరమ్మని దేశంమీద పంపాడు. జయంతి ఒంటరిగా అనేక తీర్థాలు సేవించి జగన్నాధానికి వెళ్ళేదారిలో శ్రీని కలుసుకున్నది. ఆదిమొదలు వా రిద్దరూ కలిసే ఉన్నారు.

జయంతిని గురించి ఈ వివరాలన్నీ విని శ్రీ. "జయంతి తల్లిదండ్రులు జీవించే ఉన్నారా?" అని అడిగింది.

"ఆమె తల్లి పోయి చాలాకాల మయింది. ఆమె తండ్రీ, తమ్ముడూ జీవించే ఉన్నారు." అన్నాడు రామానందస్వామి.

"వా రిప్పు డెక్కడ ఉన్నారు? ఏం చేస్తున్నారు?"

"ఆమె తండ్రి మహారాష్ట్ర నాయకుడైన బాజీరావుకు మంత్రిగా ఉన్నాడు. ఆమె తమ్ముడు బాజీరావు సైనికులలో ఒకడు."

శ్రీ సంకోచిస్తూ, సిగ్గుపడుతూ, "స్వామీ. తమరు త్రికాలవేదులు. తమకు తెలియని విషయం లేదు. నా భర్త ఇప్పు డెక్కడ ఉన్నాడు? ఏ స్థితిలో ఉన్నాడు?" అని అడిగింది.

"అమ్మా, ఆ సంగతి తెలుసుకుని నీ కేం ప్రయోజనం. నీ మోక్షం నువ్వు చూసుకో. నీ మనశ్శాంతి కోసం కొన్ని విషయాలు మాత్రం చెబుతాను. నీ భర్త కులాసాగానే ఉన్నాడు. అతనొక అపూర్వ వ్యక్తివెంట ఉన్నాడు. ఆ వ్యక్తి యొక్క సహాయంతో తిరిగి రాజ్యలాభం కూడా పొందగలుగుతా డనుకుంటాను. అందుచేత నువ్వతన్ని గురించి చింతపడ నవసరం లేదు. నీకు నీ భర్తను చూడా లన్న కోరిక ఉన్నదా?"

"లేదు. నా ముఖం కనిపించటం వల్ల ఆయనకు కష్టాలూ, ప్రమాదాలూ తప్ప మరేమీ కలగటంలేదు. అందుచేత ఆయన చాయలకైనా వెళ్ళను." అన్నది శ్రీ.

# 4

బాజీరావుకు రఘునాథుడిపైన సద్భావమూ, నమ్మకమూ కుదరటాని కెంతో కాలం పట్టలేదు. అతనితో మాట్లాడుతుంటే, అతను చాలా తెలిసినవా డనీ, అనుభవం గలవాడనీ, సమర్థుడనీ, వీరుడనీ, స్వార్థంలేని ఉదారుడనీ, విశ్వాసపాత్రుడనీ బాజీరావుకు స్పష్టమయింది. తనకు అతనిపై గల ఆదరాన్నిబట్టి బాజీరా వతన్ని రాజదూతగా నియమించాడు.

ఇది చాలా గౌరవంతో కూడుకున్న పదవి. సమర్థులైన గొప్ప సేనానులు ఆ పదవి కోసం ఆశపడతారు. ఎక్కడి నుంచో వచ్చిన అపరిచితుడికి ఆ పదవి లభించటం చూసి బాజీరావు వద్ద చాలా కాలంగా సేవ చేస్తున్న వారికి కొందరికి చాలా అసూయ పుట్టింది. వారు పైకి ఏమీ అనలేక, లోలోపల రఘునాథుణ్ణి ద్వేషించసాగారు.

బాజీరావు గూఢచారులు దేశమంతటా ఉన్నారు. ఢిల్లీలో తనమంత్రిపదవికి రాజీనామా ఇచ్చి, అసఫ్‌జా సపరివారంగా దక్షిణ దేశానికి తిరిగి పోతున్నట్టు గూఢచారులు బాజీరావుకు వార్త అందించారు. భారత దేశాని కంతకూ ప్రభువు కావాలని బాజీరావు కోరిక. అయితే అందుకు ఒకటే ప్రతిబంధకం ఉన్నది — దుర్రానీలను జయించకుండా ఢిల్లీని జయించ తల పెట్టటం వృథా. దుర్రానీలను జయించే

నిమిత్తం సైనికసహాయం చెయ్యమని మైసూరు రాజును కోరటానికి ఒకదూతను పంపాలని బాజీరావు నిశ్చయించి, ఆ పనికి రఘునాథుణ్ణి నియమించాడు. రఘునాథుడు ముప్పై నలుగురు అశ్వికులనూ, ఒక హవల్దారునూ వెంటబెట్టుకుని మైసూరు వెళ్ళటానికి సన్నాహం జరిగింది.

రఘునాథుడి వెంట వెళుతున్న హవల్దారు ఇరవై అయిదేళ్ళవాడు. అతను బాజీరావు వద్ద మంత్రిగా ఉంటున్న మల్హారిరావు కొడుకు ద్వారకానాథ్: బాజీరావు వద్ద ఉండే అందరికన్నా వృద్ధుడు మల్హారిరావు. ఆయన వయస్సు ఎనభై దాటింది. కాని ఆయన శరీరంలో మంచిపటుత్వ మున్నది, తెల్లని, నిడుపైన గడ్డం ధరించి, చూసేవారి కందరికీ భక్తి కలిగించేలా గుండేవాడు. బాజీరావుకు ఆయన పైన మంచిగురి.

మల్హారిరావు సదభిప్రాయాన్ని కూడా రఘునాథుడు చాలాత్వరగా సంపాదించుకోగలిగాడు. రఘునాథుడివంటి యోగ్యుడికి రాజ దూతపదవి లభించటం మల్హారిరావునెంతో సంతోషంకలిగించింది. ఇతరులలాగా ఆయన ఈర్ష్య పడకపోగా, ఇతరులు అసూయచేత తనఎదట రఘునాథుణ్ణిగురించి హీనంగా మాట్లాడినప్పుడు వారిని మందలించాడుకూడా.

రఘునాథుడికి పెద్దపదవి దొరికినందుకు కళ్ళలో నిప్పులుపోసుకున్నవా రిద్దరూ— భాస్కరపండిత్, కరమ్‌చంద్ భోంస్లే అనేవాళ్ళు. వారిద్దరికిందా చెరొక అయిదు వేల అశ్వికసైన్యమూ ఉండేది. వాళ్లు మన్సబ్‌దార్లు. వారి ప్రభుభక్తి లోగడ అనేక మార్లు రుజువయింది వారి సహాయంతో బాజీరా వనేక విజయాలు సాధించాడు. కాని ఇప్పుడు ఈర్ష్యతో వారి మనస్సులు విషపూరితమైపోయాయి.

రఘునాథుడు తన వెంటవస్తున్న ద్వారకానాథుడి అందమైన ముఖాన్నిచూసి. అదే పోలికగల మరొక స్త్రీముఖాన్ని, ఆస్త్రీకి తాను వెనకచేసి ఉండిన అపచారాన్ని జ్ఞాపకం తెచ్చుకుని చాలా బాధపడ్డాడు. ఆస్త్రీకీ, ఈ యువకుడికీ అంతపోలిక ఎందు కున్నదీ అతనికి అంతుబట్టలేదు.

బాజీరావు రఘునాథుడికి అతను జరపవలసిన దౌత్యం సందర్భంలో చెప్పవలసిన దంతాచెప్పి. పనిపూర్తిచేసుకుని రాయగడానికి రమ్మని ఆజ్ఞాపించాడు.

రఘునాథుడు సపరివారంగా యథాకాలానికి మైసూరు చేరుకున్నాడు. బాజీరావు పంపిన కానుకలతోసహా మైసూరురాజును సందర్శించాడు. బాజీరావు పేరుచెబితే ఆ రోజుల్లో భారతదేశ మంతటా ఎంతో గౌరవం. ఆయన దూతఅయిన రఘునాథుడికి గొప్పగా గౌరవమర్యాదలు జరిగాయి.

రెండుమూడు రోజుల అనంతరం రఘునాథుణ్ణి దర్బారుకు పిలిపించారు. మైసూరురాజు విందుసభలో అతనిరాకకు కారణమడిగాడు. రాచకార్యాలు ఏకాంతంగా చర్చించదగినవని రఘునాథుడు జ్ఞాపంచేశాడు.

"నీవు రాజనీతి ఎరిగినవాడివిలాగే కనబడుతున్నావు. కాని నీరూపమూ, వేష భాషలూ చూడగా మహారాష్ట్రిడివిలాగా కనిపించటంలేదు. నిన్నుగురించి తెలుసుకో వచ్చునా?" అన్నాడు రాజు.

"నేను మహారాష్ట్రిణ్ణికాను. బెంగాలు దేశానికి చెందిన కాయస్థుణ్ణి. చిన్నతనం నుంచీ వీరుడుగా జీవిస్తూ ఇప్పుడు బాజీరావుగారి కొలువులో ఉన్నాను. ఆయన నన్ను గౌరవంతో ఆదరిస్తున్నారు." అన్నాడు రఘునాథుడు.

"బాజీరావు వద్ద ఎంతకాలంగా కొలువున్నావు?"

"ఇంచుమించు ఎనిమిది మాసాలుగా."

"మీ కిద్దరికీ పూర్వపరిచయ మేమన్నా ఉన్నదా?"

"ఏమీలేదు."

"ఇంతకు పూర్వం ఏంచేస్తూండేవాడివి?

"సీతారామరాజు దగ్గిర సేనాపతిగా ఉండేవాణ్ణి. ఆయన నుంచి రాజ్యలక్ష్మి తొలగిపోయిందీ. నేనుకూడా తొలగిపోవలసి వచ్చింది."

మహారాజు రాజ్యం అభివృద్ధి పొందుతుండడంచేత ముసల్మానులు సహించలేక పోయారనీ, సుబేదారు ఆజ్ఞాపించగా ఫౌజ్‌దార్ సేనలతో వచ్చి నగరంమీద పడ్డాడనీ, ముసల్మాను సేనలనుండి సీతారామరాజు రాజధానిని కాపాడటం అసాధ్య మయిందనీ రఘునాథుడు మైసూరు రాజుకు తెలిపాడు.

"బెంగాల్‌కు సుబేదారెవరు?" అని రాజు అడిగాడు.

"ముర్షిద్‌కులీఖాన్ అనే అయోగ్యుడు. ప్రజలకు అతనంటే చాలా అసహ్యం. ఢిల్లీ పాదుషా కోరలుతీసిన పాములాటివాడు కావటంచేత సుబేదారుకు పట్టపగ్గాలు లేవు ఈ ముసల్మానులకు పతనం తప్పదు."

"నిజమే కాని, ప్రస్తుతం వాళ్ళు ఉచ్ఛదశలో ఉన్నారు. హిందూస్థానమంతా వారిచేతిలో ఉంది. దేవుడు వారికి అనుకూలంగా ఉన్నాడు."

"అన్నీ తెలిసిన మీబోటివారలా అనటం భావ్యంకాదు. దేవుడిదృష్టిలో అందరూ ఒకటే. లక్ష్మి చంచలమైనది. న్యాయాన్ని విడిచిపుచ్చిన ముసల్మానులు పతనమై తీరుతారు. దుష్టశిక్షణా, శిష్టరక్షణా చేయటానికే బాజీరావువంటి వారినీ మీవంటివారినీ భగవంతుడు సృష్టిస్తాడు. హిందూదేశాన్ని మీరే పునరుద్ధరించాలి."

రఘునాథుడి మాటలకు రాజు తృప్తిపడి, మర్నాడు ఏకాంతంగా మాట్లాడతా నని మాటఇచ్చి, అతన్ని పంపేశాడు.

మైసూరుపాలకుడు ముప్పైరెండేళ్ళ వయసు గలవాడు. చిన్నవాడైనా రాజ కార్యాలను నిర్వహించడంలో చాలా చాకచక్యం కలవాడు. మహమ్మదీయుల శక్తులను అరికట్టి, తన రాజ్యాన్ని విస్తరింపజేసుకోవాలన్న కోరిక అతనిలో దృఢంగా ఉన్నది. మహమ్మదీయులతో యుద్ధానికిగాను అతను సేనలను పెంచుకుంటూ, ఆహారం నిలవచేసుకుంటూ వస్తున్నాడు. మహమ్మదీయులు ప్రతిదేశంలోనూ దేశ ద్రోహులను చేరదీసి వాళ్ళ సహాయంతో ఇతర దేశాలను ఆక్రమించుకుంటూ వస్తున్నారు. వారిని యుద్ధంద్వారా నిలవచెయ్యకపోతే మైసూరుకు కూడా అదేగతి పట్టుతుంది.

అయితే మైసూరుకు సన్నిహిత ముసల్మాను శత్రువు ఢిల్లీలో శక్తిహీనుడుగా ఉంటున్న పాదుషాకాదు; దక్షిణదేశంలో సొంతరాజ్యం స్థాపించుకుని, సమర్థుడై ఉన్న అసఫ్‌జా. మైసూరుపైకి అసఫ్‌జా చాలాసార్లు దండెత్తివచ్చాడు. కాని మైసూరుపాలకుడి చతురతవల్ల అసఫ్‌జా ఎత్తులు పారలేదు. అసఫ్‌జా ఢిల్లీవెళ్లా డన్న తెలిసినప్పుడు కూడా మైసూరురాజు అశ్రద్ధ వహించకుండా తన యుద్ధ యత్నాలు కొనసాగించాడు.

ఈ విషయాలు బాజీరావుకు తెలుసు బాజీరావు ఢిల్లీని వశపరచుకోవటానికి దుర్రానీలు పెద్దప్రతిబంధకంగా ఉన్నారు. మైసూరురాజు సేకరించి ఉంచిన ఆహార పదార్థాలూ, సేనలూ తనకు సహాయం చేసినట్టయితే ఆయన దుర్రానీలను సింధు నది దాటించి తరమగొట్టవచ్చు. ఇందునిమిత్తం తనకు సహాయపడమని కోరుతూ బాజీరావు రఘునాథుడిద్వారా మైసూరురాజుకు రాయబారం పంపాడు.

అందుకు మైసూరురాజు సమ్మతించాడు; ఎందుకంటే, అసఫ్‌జాను తాను అణగ దొక్కటానికి బాజీరావు సహాయం అవసరం ఇది రాజకీయ చదరంగంలో ఒక ఎత్తుగడ. నిజానికి, బాజీరావుకూ, మైసూరు రాజుకూ మధ్య వాస్తవమైన స్నేహ భావం ఏమీలేదు. ఎవరిమనసులో ఉండేదుకుళ్ళు వారిమనసులో ఉండనే ఉన్నది.

మైసూరురాజు మనస్సు రఘునాథుడికి తేలికగా అర్థమయింది. అతను రఘు నాథుణ్ణి మరీ ఘనంగా సన్మానించాడు; అనేక కానుకలూ, రెండువేల రూపాయలు నగదూ ఇచ్చాడు సూక్ష్మబుద్ధి అయిన రఘునాథుడికి ఈ చర్యలలో కాపట్యం గోచరించింది. బాజీరావు ఘనత మైసూరు రాజుకు కంటకింపుగా ఉన్నట్టు అతను కనిపెట్టాడు. అతన్ని పంపేస్తూ మైసూరురాజు బాజీరావుకు ఒక ముత్యాల హారాన్ని

వివిధ రత్నాలుపొదిగిన ఒక ఖడ్గాన్ని బహుమానంగా పంపాడు. అతి తియ్యని మాటలతో ఒక ఉత్తరం కూడా పంపాడు.

రఘునాథు డవన్నీ తీసుకుని రాయగడానికి బయలుదేరాడు. అతని వెంటవున్న ద్వారకానాథుడు; "మనం వచ్చినపని అయిందా ?" అని అడిగాడు.

"అయిందో, కాలేదో స్పష్టంగా చెప్పలేను. సంధి అయితేజరిగింది. కాని ఇది స్వార్థంకోసం జరిగిన సంధి; సత్యానికీ, ధర్మానికీ కట్టుబడి, పరస్పర సహాయం అపేక్షించి చేసుకున్న సంధికాదు. ఇలాటి సంధులవల్ల స్నేహం కలవడదు. అవసరం వచ్చినప్పుడిది అవలీలగా భగ్నమవుతుంది. మైసూరు రాజు చతురుడు. అతనిపట్ల మన చాతుర్యమే ఉపయోగించాలి." అన్నాడు రఘునాధుడు.

"మవూ చతురుడివే. మనం ఎలాటి చాతుర్యం ఉపయోగించవలసి ఉంటుంది ?"

"ఒక్క విషయంలో ఉభయపక్షాలస్వార్థమూ కలిసి ఒకటిగా ఉన్నది అనఫ్జా ఈ ఇద్దరికీ శత్రువే. ఆ శత్రువును నిర్మూలించే పని బాజీరావుకు కలిసివచ్చేలాగా జరగాలి. మన తెలివితేటలముందు మైసూరురాజు తెలివితేటలు ఎక్కరావు బాజీరావు మార్గానికి ప్రతిబంధకాలు కలిగించటం ఎవరితరమూకాదు. మైసూరురాజు కుయత్నాలు చేశాడో, దానికి ఫలం తప్పక అనుభవిస్తాడు."

రఘునాథుడీమాట అన్నమీదట ద్వారకానాథునికి అతనిపైన మరింతభక్తివిశ్వాసాలేర్పడ్డాయి.

త్వరగా చేరుకోవాలన్న ఉద్దేశంతో రఘునాధుడి పరివారం అడ్డదార్లవెంబడి రాయగడానికి ప్రయాణం చేశారు. అందుచేత వారికి కష్టాలు కలిగాయి. దారిలో కాలయాపనకూడా అయింది;

మైసూరునుంచి బయలుదేరిన ఎనిమిదిరోజులకు వారు మహారాష్ట్ర సరిహద్దును చేరుకున్నారు. ఆ సరిహద్దు వద్దనే చంద్రరావు కిల్లా ఉన్నది. ఆ దుర్గం ఒకప్పుడు చంద్రరావుమోరే ఉండినది. ఇప్పు డది పాడుపడి ఉన్నది. అందులో కోయవాళ్ళు దొంగలూ ఉంటున్నారు. ఆప్రాంతం రఘునాధుడికి కొత్తగాని, ద్వారకానాధుడికీ మిగిలిన మహారాష్ట్రులకూ బాగా తెలిసినదే.

ద్వారకానాథుడు రఘునాథుడితో, "ఇక్కడికి దగ్గరలోనే చంద్రరావుకిల్లా ఉన్నది అందులో రంగరాజనే బందిపోటు నాయకుడూ, అతని అనుచరులూ ఉంటున్నారు. అతని పేరుచెబితే ధనికులకు గుండెదడ. అతన్ని పట్టుకోవటానికి బాజీరావు ఎన్నో ప్రయత్నాలు చేశాడుగాని, లాభం లేకపోయింది. రాజోద్యోగుల లోనే అతని మనుషు లున్నారు. ఎప్పటి కప్పుడతనికి వార్తలందించి, అతను పట్టు

పటకుండా తప్పించుకోవడానికి సహాయం చేస్తున్నారు. అతనికింద అనేకమంది మావలీలనే కొండజాతివాళ్ళూ, ముసల్మానులూ కూడా వున్నారు. వాళ్లు పట్టపగలే కత్తులూ, తుపాకులూ తీసుకుని గ్రామాలపైన పడిదోచుకుంటూ వుంటారు వాళ్ళపేరు చెబితే అందరికీ భయమే. అందుచేత మనం చీకటిపడేలోగా ఈచోటు దాటిపోవాలి. రాయగడ మింకా నలభై కోసులున్నది." అన్నాడు.

ఈ మాటకు రఘునాథుడు చిరునవ్వు నవ్వి, "నువ్వు చెప్పినదంతా బాగానే ఉన్నది గాని, మనం ఈ చిన్నచిన్న దోపిడిగాళ్ళకే భయపడితే, పెద్ద దోపిడిగాళ్ళనెలా శిక్షిస్తాం?" అని అడిగాడు.

అమాయకుడైన ద్వారకానాథుడు, "పెద్దదోపిడి గాళ్ళంటే ఎవరని మీ ఉద్దేశం?" అని అడిగాడు. ఇళ్ళలో జొరబడి ధనం ఎత్తుకుపోయేవాళ్ళు చిన్నదోపిడిగాళ్ళు దేశాలను దోచుకొని, స్వాతంత్ర్యం హరించేవాళ్ళు పెద్దదోపిడిగాళ్ళు. తేడాఏమిటంటే, చిన్న దోపిడిగాళ్ళను లోకం తిట్టిపోస్తున్నది, పెద్ద దోపిడిగాళ్ళను వీరపురుషులుగా కొనియాడుతున్నది. నరహత్యలను చేసేవారు వీరపురుషుల మనిపించుకుంటున్నారు. న్యాయంకోసమూ, ధర్మంకోసమూ కత్తిపట్టే నిజమైన వీరపురుషులీ పాపిష్టికాలంలో అరుదై పోతున్నారు," అన్నాడు రఘునాథుడు.

వాళ్ళు చంద్రరావుకిల్లా చేరుకునేసరికి రెండు జాములయింది. ఆ ప్రాంతమంతా కొండగుట్టలమయం. చంద్రరావుదుర్గం అలాటి గుట్టలమధ్య కొండపైన కట్టబడిఉన్నది. ఆ దుర్గంలో రంగరాజు తన పరివారంతో సహా ఉంటున్నాడు. అతని గూఢచారులు అన్నివైపులకూ వెళ్ళి, వార్తలు తెస్తూంటారు. ఆపద కలగబోతుంటే అతను ముందుగానే జాగ్రత్తపడతాడు.

రంగరాజు పేరు దక్షిణ దేశమంతటా ప్రసిద్ధి కెక్కింది. అతని ఆచోకీ తెలిపిన వారికి పదివేల రూపాయ లిస్తానని బాజీరావు ప్రకటించాడు. కాని లాభం లేకపోయింది. చరిత్ర ప్రసిద్ధుడైన రంగరాజు చనిపోయాక అతని అనుచరులు అనేక శాఖలుగా చీలిపోయారు. ఆ శాఖలలో పిండారీ లనేది భారతదేశ మంతటా వ్యాపించి, అనేక అమానుష కృత్యాలు చేసింది. చేతూఖాన్, కరీమ్ అనేవాళ్లు సుప్రసిద్ధ పిండారీ నాయకులు. నర్మదానదీ తీరాన వీ రిద్దరూ ఇంగ్లీషు వాళ్ళ చేతిలో చనిపోయాక పిండారీల ప్రభ అంతరించిపోయింది.

దుర్గానికి దిగువ నున్న కొండ కింద రఘునాథుడు శిబిరం వేయించాడు. వంట ప్రయత్నాలు సాగుతున్నాయి. రఘునాథుడు అవతలగా సంధ్య వార్చుకుంటున్నాడు. ఇంతలో వింజామర లాటి గడ్డం పెట్టుకుని ఒకముసలి ఫకీరు వచ్చి, ద్వారక

వాడుడితో. "బాబూ, మీరెక్కణ్ణుంచి వస్తున్నారు? ఎక్కడికి పోతున్నారు?"
అని అడిగాడు.

"దాదాసాహెబ్, మేం మైసూరునుంచి రాయగడంకు పోతున్నాం." అని ద్వారకనాథుడు జవాబుచెప్పాడు.

"అవ్వా! మీకు నాయకుడెవరు?" అని ఫకీరు మళ్ళీ అడిగాడు.

"రఘునాథరాయలు. పీష్వా తరపున మైసూరు దూతగా వెళ్ళి వస్తున్నాడు."

ఈ సంభాషణ విని రఘునాధుడు టెప్పున ఇవతలికి వచ్చేటంతలోనే, ఫకీరు ఎటో జారుకున్నాడు.

ఫకీరు వాలకంచూసి రఘునాధుడు అపాయం శంకించి, శిబిరం ఎత్తించి మరొక చోటికిపోయే ప్రయత్నంలో బాకా ఊదించాడు. వెంటనే సైనికులందరూ సిద్ధమై గుర్రాలెక్కి నిలబడ్డారు. ద్వారకానాథుడు కత్తిదూసి వారితో చేరాడు. అందరూ కలిసి మైదానం మీదికి నడిచారు.

నూరుమందికి పైగా కొండమీదినుంచి దిగి వస్తూండటం వారికి కనిపించింది. అందరికీ వెనకగా తెల్లగుర్రం ఎక్కి ఒక ఎత్తయిన మనిషి దిగి వస్తున్నాడు.

రఘునాథుడు ద్వారకనాథుడితో, "చూడు! వాళ్ళేదో దురుద్దేశంతోనే కిందికి వస్తున్నారు. మన సంఖ్యకన్న వారిది చాలా హెచ్చు. అందుచేత మనం ఆత్మరక్షణ చేసుకోవటానికి మైదానం మీదికివెళ్ళి, చెట్లచాటున చేరాలి." అన్నాడు.

రఘునాధుడి సైనికులు చెట్లచాటుకుచేరి కొండ దిగివచ్చే వాళ్ళపైన తుపాకులు కాల్చారు. దొంగలలో ముప్పైమంది దెబ్బతిని పడిపోయారు. వాళ్లు ఎంత వెతికినా రఘునాధుడి సైనికులజాడ తెలియలేదు. వారుకూడా తుపాకులు పేల్చారు గాని, సైనికు డొక్కడైనా దెబ్బతినలేదు.

ఈ హత్యాకాండ సాధ్యమైనంతత్వరగా ముగించాలనే ఉద్దేశంతో రఘునాధుడు తన తుపాకీతీసి, తెల్లగుర్రంమీద ఎక్కిఉన్న వాడికేసి గురిచేసి కాల్చాడు. వెంటనే ఆ మనిషి గుర్రంపైనుంచి కిందపడ్డాడు. మిగిలిన దొంగలు చెల్లాచెదురుగా పారిపోయారు.

అయిదుగురు సైనికులువెళ్ళి కింద పడిపోయినవాణ్ణి మోసుకువచ్చారు. రఘునాధుడు పేల్చినగుండు ఆ మనిషి భుజానికి తగిలింది. ప్రాణాపాయ కరమైన దెబ్బ కాదు. ఆ మనిషికి తాత్కాలికంగా స్పృహతప్పింది — అంతే.

రఘునాధు డతన్ని తన శిబిరానికి తీసుకుపోయి, ఒక మంచంపైన పడుకోబెట్టించాడు, చొక్కావిప్పించి, గాయం కడిగించాడు. చొక్కాజేబులో ఒకఉత్తరం

ఉన్నది. దాని ఆరంభంలో, "ప్రియతముడైన శ్రీరంగరాజ సోపాలే మహాశయుడికి" అని ఉన్నది. అదృష్టవశాన దొంగలనాయకుడే రఘునాధుడికి దొరికిపోయాడు.

రఘునాధు దతవి గాయానికి మందువేయించి, కట్టుకట్టించి, ఒక ఏనుగుమీద పరుపువేసి, దానిపైన పడుకోబెట్టి, సపరివారంగా మరినాలుగు కోసులదూరం ప్రయాణించి అక్కడ గుడారాలు దింపించాడు. అక్కడ అందరూ విశ్రమించారు.

# 5

భోజనాలుచేసి శిబిరంలో అందరూ నిద్రపోయాక రఘునాధుడు దీపం వెలిగించి, దొంగల నాయకుడి జేబులో దొరికిన ఉత్తరాన్ని ఆత్రంగా చదవసాగాడు. అందులో ఇలా ఉన్నది.

"ప్రియతముడైన శ్రీరంగరాజ సోపాలే మహాశయుడికి,

సోదరా ! నీకు జగదీశ్వరుడు సదా సుఖం కలిగించుగాక. మనకుగల బంధుత్వ బంధం ఈ జన్మలో తెగేదికాదు. ఆకారణంచేత మాకు నీపైనగల ప్రేమాదరాలు అనేక సందర్భాలలో నిరూపించిఉన్నాం. మా శరీరంలో ప్రాణా లున్నంతదాకా యధాశక్తి సహాయం చేస్తూనేఉంటాం. ప్రభువు తరపువా శ్వైవరూ నీకు ఎలాటి హానీ చెయ్యలేరు. నీకు ప్రతికూలంగా ఏం జరగ నున్నప్పటికీ, ఆ విషయం ముందుగానే నీకు తెలియబరుస్తూఉంటాం. మే ముండగా నీ కెలాటి భయమూ కలగ బోదు. నీ శత్రువు మాకెంత ఆత్మీయుడైనా శత్రువుతో సమానుడే. అదేవిధంగా మా శత్రువులను నాశనం చెయ్యటానికి నీవుకూడా సిద్ధంగానే ఉండాలి. నీవల్ల మాకొక సహాయంకావాలి. దాని వివరాలు ఈ లేఖ తెచ్చినవాడే నీకు చెబుతాడు.

మైసూరునుంచి చంద్రరావుకిల్లా మీదుగా ఉన్నమార్గం వెంబడి కొందరు ప్రయాణీకులు రాబోతారు. వారివెంట ముప్పైఏనలుగురు సైనికులు మాత్రమే ఉంటారు. ఆ పరివారానికి ప్రధాన వ్యక్తిగా వచ్చేవాణ్ణిమాత్రం చంపెయ్యాలి. మిగిలిన వాళ్ళను భయపెడితేచాలు. చంపనవసరంలేదు ముందు చెప్పిన మనిషిని మాత్రం పూర్తిగా చంపెయ్యాలి, అశ్రద్ధ చెయ్యగూడదు. అందుకొరకు ఏ పద్ధతి అవలంభించినా ఫరవాలేదు. మనిషిని అతి సులువుగా గుర్తించవచ్చును. అతను బెంగాలీవాడు. దోమలాగా దుర్బలుడూ, పట్టుపురుగులాగా అవివేకి అని వేరే చెప్ప నవసరంలేదు. దోమను చంపటానికి ఫిరంగులు కావాలా ?

ఈ సహాయం ద్వారా మన స్నేహం మరింత అభివృద్ధి చెందగలదు. నీశ్రేయస్సు

నిరాటంకంగా అభివృద్ధి చెందేటట్టు పేంచూస్తాం. కష్టమైన పనికాదు, అశ్రద్ధ చెయ్యవద్దు.

శకవర్షం 1148. శ్రావణశుద్ధ ఏకాదశి, నీ హితైషి, భో—"

ఉత్తరం చదువుతున్నకొద్దీ రఘునాథుడికి అంతులేని ఆశ్చర్యం పుట్టుకొచ్చింది. తనకెవడో రహస్య శత్రువుండి, తనను చంపించే ఉద్దేశంతో దొంగల నాయకుడికీ ఉత్తరం పంపాడు. ఎవరీ రహస్య శత్రువు? అతడికి తాను ఎలాటి అపకారం చేసిఉంటాడు? తనకు తెలిసినంతవరకు తా నొకడి సుఖానికి అడ్డం తగుల లేదు. కనీసం ఎవరితోనూ వివాదపడనైనాలేదు. తనను చంపించటంచేత ఎవరికిగాని ఏమిటిలాభం? కాని ఆ మనిషి తన ఛావుకోరటానికేదో ఒక కారణం ఉండే ఉండాలి.

బాజీరావుకు ఎంతోకాలంగా దొరకకుండా తప్పించుకు తిరుగుతున్న గ్రజదొంగ సునాయాసంగా తన చేతికి చిక్కాడు. రహస్యం ఏమిటో అతని ద్వారానే తెలుసు కోవాలి. అభయమిస్తే చెబుతాడేమో!

ఉత్తరం రాసినది ఎవరో తెలియలేదు. అందులో రాసినవాడి పేరులేదు. ఆ ఉత్తరాన్ని రఘునాథుడు మర్నాడు ద్వారకనాథుడికి చూపాడు. అతను దాన్ని చదివి, "మనవాళ్ళలోనే ఎవడో విశ్వాస ఘాతకు డున్నాడు. అందుకే ఈ దొంగల నాయకు డింత కాలంగా పట్టుబడలేదు. ఇప్పుడు వీడు దొరికాడు గనక మన అంతరంగ శత్రు వెవడో బయటపడి పోతుంది. వా డెవడో తెలుసుకునేదాకా నాకు మనస్సా గదు. వెళ్ళి వాణ్ణి అడిగి వస్తాను." అన్నాడు.

"తొందరపడకు.. ఇంతలో మునుకుపోయే దేమీలేదు. ఇది ఉపాయంతో సాధించదగినపని. గజదొంగవంటి వాడిచేత నిజం చెప్పించటం అంత తేలిక కాదు." అన్నాడు రఘునాథుడు.

"ఆ దుర్మార్గుడు మనకు చిక్కాడు, వాడి ప్రాణాలు మనచేతిలో ఉన్నాయి. మనం భయపెడితే వాడు నిజం చెప్పక ఏం చేస్తాడు? అబద్ధం చెప్పటానికి వాడికి సాహసం ఉంటుందా?"

"నువ్వింకా కుర్రవాడివి. నీకు ప్రపంచం తెలీదు. ప్రపంచంలో కొందరు మొండివా ళ్ళున్నారు. వాళ్ళు చావనైనా చస్తారు గాని నిజం చెప్పరు. అందుచేత మనం వీణ్ణి భయపెట్టేకన్న, నిజం చెబితే ప్రాణాలు కాపాడతా మని ఆశ పెట్టటం వల్ల ఎక్కువ ప్రయోజనం ఉండవచ్చు."

దొంగల నాయకుడికి ఏ అపాయమూ లేకుండానూ, వాడు తప్పించుకుని పారిపోకుండానూ కట్టుదిట్టాలు చేసి, వాడితో సహా రఘునాథుడు రాయగడం చేరుకున్నాడు. అతను ఆ గజదొంగను కోటలోకి తీసుకుపోక, ద్వారకానాథుడి ఇంటనే ఒక గదిలో ఉంచి, గదికి ఇద్దరు భటులను కాపలా పెట్టారు.

ఈ దొంగ సంగతి ఎవరికీ తెలియకుండా ఉండటం అత్యవసరం. లేకపోతే దొంగ ఉత్తరం రాసిన వాడిపేరు వెల్లడించకుండా ఉండటానికీ; దొంగను తప్పించుకు పారిపోయే లాగా చెయటానికీ ఏర్పాట్లు జరిగి తీరుతాయి. రఘునాథుడూ; ద్వారకా నాథుడూ కూడా దొంగ విషయం బయట పెట్టమని శపథాలు చేసుకున్నారు. తమవెంట వచ్చిన సైనికులలో ఎవరన్నా బయట పెడితే వాడి ప్రాణాలు తీస్తామని బెదిరించారు.

రఘునాథుడు ఆ రోజు మల్హారి రావింటనే ఉండి, ఆ రాత్రి మల్హారిరావు దర్శనం చేసుకుని, మైసూరు వార్తలన్నీ చెప్పి, దారిలో జరిగిన దంతా చెప్పి, దొంగజేబులో దొరికిన ఉత్తరం ఆయన చేతికిచ్చాడు.

మల్హారిరావు ఉత్తరం చదివి కొంతసేపు నిశ్చేష్టుడుగా ఉండిపోయి, చివరకు, "ఇక్కడ కొందరు రాజద్రోహు లున్నట్టు నేను చాలా కాలంగా అనుమానిస్తూనే ఉన్నాను, కాని సాక్ష్యాధారాలు లేక ఏమీచెయ్య లేకపోయాను. నిన్ను చంపాలని కుట్ర పన్నినవాడు నువు పైకి రావటం సహించ లేకనే ఈ పనిచేశాడు. వాడెవడో తప్పక బయట పడతాడు. ఇలాటి కుట్రలు చాలా కాలంగా సాగుతున్నట్టు ఈ ఉత్తరం చూస్తే స్పష్టమవు తున్నది. అందు చేతనే ఎన్ని ప్రయత్నాలు చేసికూడా దొంగలను పట్టలేక పోయాం. అయితే అదృష్టవశాన మనకు దొంగల నాయకుడే దొరికాడు, ఇకరాజ ద్రోహులూ దొర్లుతారు," అన్నాడు.

"దొంగలు నిజం చెబుతా రని నాకు తోచదు," అన్నాడు రఘునాథరావు.

నేను నీకన్న చాలా పెద్దవాణ్ణి. అనుభవం గలవాణ్ణి. దొంగల నాయకుడితో ఎలామాట్లాడాలో నాకు తెలుసు. ఒకసారి నేను వాణ్ణిచూసి, వాడిచేత అదీ ఇదీ మాట్లాడించి, తరవాత పీష్వా దగ్గిరికి తీసుకు పోవాలి. అయితే మనపని పూర్తి అయేదాకా ఈ విషయం గోప్యంగా ఉండాలి."

"అందుకు తగిన జాగ్రత్త లన్నీ అదివరకే పడ్డాం."

"అయితే సరే."

ఇద్దరూ మేడ మీదినుంచి కిందికి దిగి, దొంగల నాయకుడుండే గదికి వెళ్లారు. అక్కడ ఆ దొంగ ఒంటరిగా ఉన్నాడు, మేలుకునే ఉన్నాడు. నిద్రలేక అతని

కళ్లు భయంకరంగా ఉన్నాయి. మల్హారిరావు అతన్ని దీపం వెలుగులో ఆపాద మస్తకం పరీక్షించాడు. అతని వయసు నలభై మించదు. అతను తెల్లగా, ధృఢ శరీరుడుగా కనిపించాడు. అతని కళ్ళు పెద్దవి, ఛాతీ విశాలమైనది, ముక్కు ఎత్తయినది. ముఖం అందంగానే ఉన్నదిగాని, క్రూరమైన పనులే ఎప్పుడూ చెయ్యటం చేత కఠినంగా ఉన్నది. అతని చేతికొక వజ్రపు ఉంగరమూ, మెడలో రత్న హారమూ ఉన్నాయి. అతను మహారాష్ట్రులు ధరించే దుస్తులే ధరించి ఉన్నాడు.

మల్హారిరావు అతన్ని పలకరిస్తూ, "రంగరాజ సోపాలే, నువు నిశ్చయంగా వీరుడివేగాని దుస్సాంగత్యంచేత నీచుడివై పోయావు. నీ బుద్ధి వికసించటానికి బదులుగా వక్రించింది, మంచిదారి విడిచిపెట్టి కష్టమైన దారి తొక్కావు. నీకీ ప్రపంచంలో సుఖంలేదు. ఇప్పుడు మా చేతికి చిక్కావు పారిపోయే అవకాశం ఏమీలేదు. మేం చెప్పినట్టు విని, మే మడిగినదానికి సరిగా జవాబిస్తే, నీకు అపాయం రాకుండా కాపాడగలం. నీవంటి వీరుడు మా సైన్యంలో ఉండటం మంచిదే," అన్నాడు.

దొంగల నాయకుడు నిర్భయంగా చిరునవ్వునవ్వి, "అడగకుండానే సహాయం చేస్తామంటున్నందుకు మీకు అనేక నమస్కారాలు. ఇంతకూ మీరెవరో నాకు తెలియజేస్తారా?" అన్నాడు.

మల్హారిరావు సగర్వంగా, "భారతదేశమంతటా తనకీర్తి నింపి, ఢిల్లీ పాదుషా మొదలుకుని సమస్త రాజాధిరాజులనూ గడగడలాడించే మహారాష్ట్రకుల తిలకుడు బాలాజీ బాజీరావుకు నేను ప్రధాన మంత్రిని. ప్రస్తుతం నువు ఖైదీగా ఉన్నది మా ఇంటనే. నేను తలుచుకుంటే నిన్ను మృత్యువునుంచి కాపాడగలను; నీ చావుబతుకులు నా చేతిలో ఉన్నాయి," అన్నాడు.

దర్పంగా పలికిన ఈ మాటలకు దొంగ కొంచెమైనా చలించక, "మీరు చాలా సమర్థులు, పీష్వాకు నాపైన లేనిపోనివన్నీ చెప్పి నా ప్రాణాలు తీయించగలరు. ఆ సంగతి అలా ఉంచండి. నన్ను ఏదో పేరుతో పిలిచారే, మీరు నన్ను చూసి ఇంకెవరో అనుకుంటున్నట్టున్నది. నే నెవర్నని?" అన్నాడు.

మల్హారిరావు కోపంగా, "నా ఎదట అలా బూకరించకు. అందువల్ల నీకేమీ లాభం ఉండదు సరేగదా, ప్రాణం మీదికికూడా రావచ్చు." అన్నాడు.

దొంగ చాలా వినయంగా, "నామీద ఆగ్రహించకండి. బూచి అంటే భయపడటానికి నేను పిల్లవాణ్ణికాను. నాకు ప్రాణం తృణప్రాయం. మనిషికి కావలసింది ఆత్మగౌరవం. దాన్ని నిలబెట్టుకోవడానికి ఏ కష్టాలైన సహిస్తాను. నేను జన్మలో ఎన్నడూ వినయైనా వినని పేరుపెట్టి నన్నుపిలిచి, నేనే ఆ మనిషినంటున్నారు. ఆమనిషి

ఒకవేళ ఏమైనా నేరాలు చేశాడేమో అందుకు నన్ను శిక్షిస్తానంటున్నారు. అంతపని చెయ్యగలరుకూడామా. నేను ఒంటరిగాణ్ణి. అసహాయుణ్ణి. నిరపరాధిని. నన్ను కష్టాలుపాలుచెయ్యటం బాజీరావు ప్రధానమంత్రికాక కష్టమా ?" అన్నాడు.

ఈ మాటలకు మల్హారిరావు చిరునవ్వునవ్వాడు. కాని రఘునాథుడికి కోపం వచ్చింది. దొంగ ఆడే పచ్చిఅబద్ధాలు వింటుంటే అతనికి అసహ్యం పుట్టుకొచ్చింది. తన కళ్ళఎదటనే ఈనీచుడు తెల్లగుర్రమెక్కి దొంగలతో సహా వచ్చాడు. ఉభయ పక్షాలకు యుద్ధం జరిగింది. వీడు తనమనుషులను పురిగొల్పి వారిచేత కాల్పులు చేయించాడు.

"నీచుడా. ఎందుకు అబద్ధాలాడుతావు ? మూడురోజులక్రితం నా ప్రాణాలు తీయటానికి మూరుగురిని వెంటబెట్టుకుని చంద్రరావు కిల్లా దగ్గరకు నువురాలేదా ?" అన్నాడుతను.

దొంగ బిగ్గరిగా నవ్వి. "నేను నిన్నెందుకు చంపాలి? అందుకు మూరుగురెందుకు? నీవాలకం చూస్తే బెంగాలీవాడివిలాగున్నావు? బెంగాలీవాడి ప్రాణానికి విలువ ఏమిటి ? నిన్ను చంపటానికి నేను బయదేరి రావాలా? దోమను చంపటానికి సింహం బయలు దేరాలా ? నీవంటివాణ్ణి చంపితే నాకేం ప్రతిష్ఠ?" అన్నాడు.

రఘునాథుడి క్రోధజ్వాల ఆకాశమంటినట్టయింది.

"ఓరీ. అధముడా! నిన్నుకొట్టి. ఖైదీగా నేనే పట్టుకొచ్చాను. అలాటిది నా దగ్గరే అబద్ధాలాడుతున్నావు. నిన్ను నా కత్తితో ముక్కలు ముక్కలుగా నరికినా నాకసి తీరదు." అన్నాడతను.

రఘునాథుడికోపాన్ని దొంగ ఏమాత్రమూ లక్ష్యపెట్టక. కొంచెం నవ్వుతూ. వెటకారంగా. "వట్టిగొడ్డుకు అరుపులెక్కువ. బెంగాలీవాడు కత్తి అనటం ఇప్పుడే వింటున్నాను. వాళ్ళెంత సేపూ ఒకరి మోచేతికిందినీళ్ళ తాగవలసినవారే. నువుకూడా నీ జాతిధర్మానికి భంగం కలగకుండా మహారాష్ట్రులను సేవించుకుని బతుకుతున్నావు. నీ చేతిలోకత్తి రాణించదు. నీనోట గర్వోక్తులు అసలే రాణించవు." అన్నాడు.

క్రోధం ఆపుకోలేక రఘునాథుడు ఒరనుంచి కత్తిదూయబోతూంటే మల్హారిరావు నివారించి. "తొందరపడకు. కోపం నిగ్రహించుకో. వాడు మనచేతిలో ఉన్నవాడే. ఎప్పుడు కావాలంటే అప్పుడు మన ఇష్టంవచ్చినట్టు చెయ్యవచ్చు." అన్నాడు. దొంగకు వినపడకుండా.

దొంగ మాటలు వినలేదేగాని. రఘునాథుడు కత్తిదూయబోవటమూ ఆ వృద్ధుడు నివారించటమూ చూశాడు. అయినా అతను భయపడలేదు. అతను హాస్య

ధోరణిలోనే.'' ఇప్పుడునేను ఒంటరిగాణ్ణి. నిరాయుధుణ్ణి. ఖైదీని. అలాంటివాణ్ణి చంపటమంటే ఎంతగౌరవం! అందులోనూ దోమలాంటిబెంగాలీ వాడికి!' అన్నాడు.

"దోపిడి వృత్తిగాగల నీకు బెంగాలీల గౌరవమర్యాదలెలా తెలుస్తాయి? వాళ్ళు మొగలాయీలతో వీరోచితంగా యుద్ధాలుచేశారు. మానసింహుడివంటి మహావీరుడే వాళ్ళ పరాక్రమాన్ని పొగడాడు. నీవంటి నీచుడు నిందించినంతమాత్రాన బెంగాలీల కీర్తికి కళంకం రాబోదు. నీవంటి పశువును చంపటంలో తప్పేమీ ఉండదు." అన్నాడు రఘునాథుడు.

"మావృత్తి ధనికుల ఇళ్ళు దోచుకోటం. మీ బాజీరావు నీవంటివాళ్ళ సహాయంతో దేశమంతా దోస్తాడు. మేం తిట్లుతింటాం. మీరు కీర్తితెచ్చుకుంటారు. తమతప్పులు తెలుసుకోవటానికి గుడ్డివాళ్ళేగాని. ఇతరులతప్పులు చూడటానికి వెయ్యికళ్ళు తెచ్చుకుంటారు." అన్నాడుదొంగ.

మల్హారిరావు దొంగతో. "ఇదంతా ఎందుకొచ్చిన వాగ్వాదం?" నువు చరిత్ర జ్ఞానం ఉన్నవాడిలాగే కనిపిస్తున్నావు. అలాటప్పుడు బెంగాలీజాతిని నిందించటం అవివేకం. ప్రతి జాతిలోనూ మంచీ. చెడూఉంటుంది. బెంగాలీలు సముద్రం దాటివెళ్ళి సింహళంలో తమ విజయధ్వజం నాటారు. ధర్మాన్ని పాలించటంలోనూ, కార్య దీక్షలోనూ బెంగాలీలను మించిన భారతీయులు లేరు. నువు నిందించే ఈ మహనీయుడి గుణగణాలకు మెచ్చుకుని పీష్వాగారీయనను రాజదూతగా నియ మించారు. ఈయన తలచుకుంటే నీబోటి దొంగలను క్షణంలో పట్టగలడు. ఆయనను చూసి ఓర్చలేని ఒక అవివేకి నిన్ను పురికొల్పి కుట్రలోకి దించాడు. మీ రహస్యమంతా మాకు తెలుసు. అబద్ధాలాడి ప్రాణం పోకొట్టుకోకు." అన్నాడు.

దొంగముఖం ఒక క్షణంపాటు మాడిపోయినట్టయింది. అతను తిరిగి నిబ్బరం తెచ్చుకుని. "బెంగాలీజాతిని నేను నిందించటం పొరపాటే. కాని మీరు చెప్పిన మిగతా విషయాలు నాకేమీ అర్థంకాలేదు. ఏదో కుట్ర అంటున్నారు." అన్నాడు.

మల్హారిరావు నవ్వుతూ, "రంగరాజా, యాభైఏళ్ళుగా రాచకార్యాలు నిర్వహిస్తూ నీలాటి సర్దార్ల నెందరినో చూశాను. నీ ప్రాణాలు తియ్యటం నాకు చాలాతేలిక. నిన్ను పట్టుకోవటానికి చాలా రోజులుగా ప్రయత్నిస్తున్నాం. నీ రూపప్రతిమ కూడా మా వద్ద ఉన్నది," కావలిస్తే చూడవచ్చు. నీ నేరాన్ని నిరూపించే ఆధారాలుకూడా మా వద్ద ఉన్నవి అన్నాడు.

ఈ మాటలు వినికూడా దొంగలో ఏమీ మార్పులేదు. అతను నిర్లక్ష్యంగా, "ఇకనేం? నేను నేరస్తుణ్ణనటానికి మీ దగ్గిర ఆధారాలుంటే నన్నుతప్పక దండించ

వలసించే. నన్ను న్యాయంగా విచారించండి, శిక్షవెయ్యండి. అంతేగాని నిషాకరణంగా నన్ను, వేటగాడు మృగాన్ని కొట్టినట్టు కొట్టి, బంధించి తెచ్చి ఖైదులో ఉంచటం ఏం న్యాయం? నేనేం తప్పుచేశాను?" అన్నాడు.

"నువేం నేరాలు చేశావో నీకు తెలీదా?"

"తెలిస్తే ఎందు కడుగుతాను?"

"రాజద్రోహులతో కుట్రచేసి. బాజీరావు దూతను చంప యత్నించావు. అదృష్ట వశాన అతను తన ప్రాణాలు కాపాడుకున్నాడు. ఈ ఒక్కదానికీ నీకు మరణ దండన వెయ్యవచ్చు."

"మరణదండన వేసే శక్తిని దేవుడు మీ కిచ్చాడు. నేను రాజదూత ప్రాణాలు తీయ యత్నించానని ఆరోపిస్తున్నారు. రాజదూత అబద్ధమాడడు. ఏమి జరిగినదీ ఆయనను చెప్పమనండి. నేనేపాపమూ ఎరగను. నేనూ, నా అనుచరులూ కొండ దిగి వస్తుండగా ఆయన నిష్కారణంగా మాపై తుపాకులు కాల్పించాడు. నా మనుషులనేకమంది పక్షులు చచ్చినట్టు చచ్చారు. చివరకు నన్నుకూడా కొట్టి పట్టుకున్నారు. ఇందులో అబద్ధమేమీ లేదని రాజదూత ఒప్పుకు తీరాలి. ఆయన ప్రాణాలకు ఏం ప్రమాదం వచ్చిందని ఆయన తుపాకులు కాల్పించాడు ? మేం తనను చంపటానికి వస్తున్నామని ఏలా నిర్ధారణ చేసుకున్నాడు ?"

"ముందుగా నేను తగిన జాగ్రత్త తీసుకోకపోయినట్టయితే, నా మనుషులను నేను మైదానం మీదికి తీసుకుపోకపోతే. నిశ్చయంగా మేమంతా మీకు చిక్కి ఉండేవాళ్ళమే. అందుకే మేం ముందుగా యుద్ధానికి దిగవలసి వచ్చింది. నువు దుర్మార్గుడవని నాకు గట్టి నమ్మకం." అన్నాడు రఘునాధుడు.

"ఆనమ్మకానికి ఆధారమేమిటి ?" అని దొంగ అడిగాడు.

"నువు చంద్రరావు కిల్లా ఆక్రమించుకొని, దొంగలకు నాయకుడవై, వచ్చేపోయేవాళ్ళను దోచుకుంటూ ఉంటావని ముందుగానే నా మనుషులు నాకు చెప్పారు. తరవాత ఎవడో ఫకీరువేషంతో వచ్చి వెళ్ళాడు. వాణ్ణి గురించి నాకు సందేహం కలిగింది. తరవాత నువు నీ పరివారంతో కొండ దిగి వస్తుండటం చూశాక నా సందేహం రూఢి అయింది, నీవెంట మూడుమంది దొంగలున్నారు, నావెంట ఉన్నది ముప్పైనలుగురు మాత్రమే. అలాటప్పుడు నేను ఆత్మ రక్షణకోసం ముందుగానే నిన్ను ఎదుర్కోవలసి వచ్చింది. అనవసరంగా నీ మనుషులను చంపటం ఇష్టంలేక నిన్ను పడగొట్టాను. తరవాత నీ మనుషులు పారిపోయారు." అన్నాడు రఘునాధుడు.

"మేం మీప్రాణాలు తియ్యటానికని వస్తున్నట్టు మీకెలా తెలిసింది ?"

"నీ గాయాలు కడిగించటానికి చొక్కా విప్పినప్పుడు దాని జేబులో ఒక పుత్తరం దొరికింది. అందులో నీ ఉద్దేశ్యమూ, నువు వచ్చిన పని స్పష్టంగా ఉన్నాయి."

"రెండుమూడు నెలలుగా నాకే ఉత్తరము రాలేదు. నాదగ్గిర ఏ ఉత్తరమూ లేదు. నా జేబులో మీకు ఉత్తరం దొరికిందనీ, నేను మీ ప్రాణాలు తియ్యటానికి వస్తున్నా నన్న విషయం అందులో ఉన్నదని వింటూంటే నాకాశ్చర్యంగా ఉంది. నా ప్రాణాలు తియ్యటానికి మీరే ఒక ఉత్తరం సృష్టించినట్టుంది !"

దొంగ ఈమాట అనేసరికి రఘునాథుడు మండిపడి, "ద్రోహీ, ఇంతకాలానికి నీ పాపం పడింది. ఇప్పటికైనా నాశనం కాకుండా ఉండగోరితే మంచిగా నిజం చెప్పు." అన్నాడు.

"మంచిది, ఏం చెప్పమంటారు ?"

"నీకాఉత్తరం ఎవరిచ్చారు ?"

"నాకెవరూ ఉత్తరం ఇయ్యలేదనీ, మీరేదాన్ని సృష్టించి ఉంటారనీ ముందే చెప్పానుగద."

మల్హారిరావు రఘునాథుడనబోయేమాటకు అడ్డొచ్చి, "వీడు నిజంచెప్పడు. చెప్పకపోయినా మనకు నష్టంలేదు. అబద్ధాలతో వాడు తనకాళ్ళను తానే తెగేసుకుంటున్నాడు. మనం వీణ్ణేమీ అడగనవసరంలేదు." అన్నాడు.

ఇద్దరూ అక్కడినుంచి వెళ్ళిపోయారు

## 6

మహారాష్ట్రుల రాజధాని అయిన రాయగడంలో బాజీరావు కొలువు తీరాడు. రాజోద్యోగులందరితోనూ సభ నిండుగా ఉన్నది. విచ్చుకత్తులు ధరించి భటులు అటూ ఇటూ తిరుగుతున్నారు. సభా భవనం మధ్యగా రెండు సింహాసనాలు ఎత్తుగా వేసి ఉన్నాయి. వాటిలో ఒకటి అసలైన బంగారు సింహాసనం, రెండవది నకలు సింహాసనం. అసలు సింహాసనంపైన రాజలాంఛనమైన కిరీటాన్ని ఉంచి, బాజీరావు నకలు సింహాసనంపైన కూర్చున్నాడు. ఆయన కిరీటం ధరించేవాడుకాడు.

సభా భవనంలోకి మల్హారిరావు రఘునాథుడితో సహా ప్రవేశించాడు. రఘునాథుడు సింహాసనం వద్దకు వెళ్ళి, తలవంచి నమస్కారం చేశాడు. బాజీరావతన్ని ఆశీర్వదించి, తన సమీపంలో కూర్చొబెట్టుకుని కుశలప్రశ్నలు చేశాడు.

రఘునాథుడు బాజీరావుకు, తాను మైసూరుకు బయలుదేరినది మొదలు తిరిగి

వచ్చినదాకా జరిగినదంతా చెప్పాడు—చంద్రరావుకిల్లా సమీపంలో జరిగిన సంఘటనలు చెప్పలేదు. అతను తన దౌత్యం తాలూకు వివరాలన్నీ చెప్పి, మైసూరు రాజు పంపిన కానుకలనూ, లేఖనూ, బాజీరావుకు అందజేశాడు. ఆ లేఖలో మైసూరురాజు రఘునాథుణ్ణి ఎంతో మెచ్చుకున్నాడు. అది చదివి బాజీరావుకు రఘునాథుడిపై మరింత ఆదరం ఏర్పడింది. ఆయన రఘునాథుణ్ణి బాగా మెచ్చుకున్నాడు. అదిచూసి మల్హారిరావు ముఖం ఆనందంతో వికసించింది. సభలో ఒకే ఒక సేనాపతి ఈర్ష్యతో రఘునాథుణ్ణి కోపంగా చూశాడు.

బాజీరావు రఘునాథుడితో, "మైసూరురాజును గురించి నీకు కలిగిన అభిప్రాయం ఎలాటిది ? దాన్నిబట్టి మన కర్తవ్యం నిర్ణయించుకుందాం," అన్నాడు.

"ఆయన పైకి అనేది ఒకటీ, అనుకుంటున్నది మరొకటీ అని నాకుతోస్తున్నది. అతను మీ మేలుకోరేవాడుకాడు, మీరు పైకిరావటం అతనికి బాధగానే ఉన్నది. స్వార్థంకొద్దీ ఈ సంధికి ఒప్పుకున్నాడు. ఈసంధికి ఏమంత విలువ లేదని నాఉద్దేశం." అన్నాడు రఘునాథుడు.

"అది నే నెరగనా ? నా కతని విషయం చాలాకాలంగా తెలుసు. మా మనస్సు లెన్నడూ కలవవు. మన అవసరంకొద్దీ ఈ కపటసంధి చేసుకున్నాం. మే మిద్దరమూ ఏకమయామంటే అసఫ్‌జా భయపడి తీరుతాడు. అందుకే మైసూరు రాజు ఈ సంధికి సమ్మతించాడు. ప్రారంభంలో అసఫ్‌జాతో స్నేహంగా ఉండాలనే నా ఉద్దేశం. అయితే నేనై స్నేహంకోరితే అతను లక్ష్యపెట్టడు; ఈ సంధితో భయపెట్టితే దారికివస్తాడు. మైసూరురాజు సహాయంతో ముందు దుర్రానీలను భారతదేశంనుంచి వెళ్ళగొట్టవచ్చు. తరవాత వరసగా ఢిల్లీ పాదుషానూ, మైసూరురాజునూ, అసఫ్‌జానూ విడివిడిగా నాశనంచేసి, భారతదేశమంతటా మహారాష్ట్రరాజ్యాన్ని సాపిస్తాను. ఈ కార్యక్రమంలోనే నిన్ను మైసూరు రాజుదగ్గిరకి దౌత్యం పంపాను. నువ్వా పనిని చక్కగా నిర్వర్తించుకుని వచ్చావు. చాలాసంతోషం. మైసూరురాజు కూడా నిన్ను ఎంతో మెచ్చుకున్నాడు."

"ఇందులో నన్ను మెచ్చుకునేటందు కేముంది ? మీ ప్రభావంచేత పనులు వాటంతట అవే జరిగిపోతాయి. మేం నిమిత్తమాత్రులం. మైసూరురాజు ఏమంత సమర్థుడుకాడు, అతను మనఉచ్చులో చిక్కవలసినవాడేగాని, మనపైన ఉచ్చు బిగించగలవాడుకాడు."

పని సానుకూలం చేసుకువచ్చినందుకు బాజీరావు రఘునాథుడికి స్వర్ణఖచితమైన ఖడ్గాన్నీ, అయిదువేల నాణాలనూ బహుమానంగా ఇచ్చాడు.

సభ ముగిశాక రఘునాథుడు మల్హారిరావింటికే వెళ్ళాడు. ఆ రాత్రి భోజనంచేసి అతను పడుకొని ఉండగా మల్హారిరావు అతని పడక గదికివచ్చి, ఆ మంచంమీద ఒక పక్కగా కూర్చుని. "నేననుకున్నది నిజమే అయింది. ఇంకా కొంచెం ఆధారం దొరికితే దుర్మార్గుణ్ణి శిక్షించవచ్చు," అన్నాడు.

"మీరేమను కున్నారు ? దొరకవలసిన ఆధారమేమిటి ?" అని రఘునాథు డడిగాడు.

"దొంగకు ఉత్తరం రాసినవాడు కరమ్చంద్ భోంస్లే అనుకున్నాను."

"ఇంత ద్రోహానికి ఒడిగట్టినది మనదగ్గిర మన్సబ్‌దార్‌గా ఉంటున్నవాడా ? మీరెలా అనుమానించారు ?"

"అతని ప్రవర్తన మొదటినుంచీ అనుమానాస్పదంగానే ఉన్నది. పీష్వా నిన్ను రాజదూతగా నియమించినప్పుడే అతను నాతో నీమీద ఏమేమో చెప్పాడు. అందుచేత అతన్ని అనుమానిస్తూ వచ్చాను. ఇవాళ ఆ అనుమానం రూఢి అయింది "

"ఎలా"

"ఇవాళ దర్బారులో నేనతని ముఖం జాగ్రత్తగా గమనించాను. పీష్వా నిన్ను మెచ్చుకుని బహుమానా లిచ్చినపుడు అతని ముఖం మాడిపోయింది. ఈర్ష్యతో నిన్ను చూడసాగాడు. అతడి మనసులో ఉన్నదంతా ముఖాన కనబడింది. దొంగల సర్దారుతో నిన్ను చంపటానికి కుట్ర చేసింది నిశ్చయంగా అతనే."

"నేను కరమ్చందు కేమీ అపకారం చెయ్యలేదు. మా ఇద్దరికీ ఎలాంటి శత్రుత్వమూ లేదు. అతను నన్నెందుకు చంపించాలని చూస్తున్నాడో ?"

"ఇతరుల బాగు చూడలేని ధర్మజ్ఞాన శూన్యుడికి మిత్రుడేమిటి? శత్రుడేమిటి ? అతడికన్న నువు గొప్ప పదవిలో ఉన్నావు గనక శత్రువువే ; నిన్ను చంపి తేగాని వాడి ఆత్మ శాంతించదు. అయితే ఈ దుర్మార్గంలో అతనికి భాగస్వామి మరొక డున్నాడని తోస్తున్నది."

"అది ఎవరు ?"

"భాస్కర పండితుడనే బ్రాహ్మణుడు. ఈ కుట్రలో అతనుకూడా ఉన్నాడనే నా అనుమానం. అతనుకూడా నీకు విరుద్ధంగా నాతో మాట్లాడిన వాడే. అయితే అతను చాలా గడుసువాడు. త్వరగా బయటపడే రకం కాదు."

"ఆ ఉత్తరం రాసింది కరమ్చందేనా ? అది అతని దస్తూరీయేనా ?"

"కాదు దాన్ని ఎవడో -ధబ్బుకు గడ్డి తినేవాడు రాశాడు. వాడి ద్వారానే మనం నిజం తెలుసుకుని అసలైన దుర్మార్గులను శిక్షించవచ్చు."

"వాడు మనకెలా దొరుకుతాడు ? నిజం ఎందుకు చెబుతాడు? నిజం బయటపడితే. కుట్రలో పాల్గొన్నందుకు వాడుకూడా శిక్ష పొందుతాడుగా ?"

"లేదు—లేదు. నిజం బయటపెట్టినందుకు అతను శిక్ష పొందకపోగా, బహుమానం పొందుతాడు. వాడి దేముంది ? యజమానిపట్ల విశ్వాసంకొద్దీ చెయ్యమన్న పనిచేస్తాడు తప్పుడు పనులు చేసేవాళ్ళను దండించాలిగాని. విశ్వాసంగల నౌకర్లను దండించరాదు."

"బాగానే ఉంది. అలాటి మనిషి మనకెలా దొరుకుతాడు ?"

"ఉత్తరాన్ని పట్టుకుపోయి ఇచ్చిన నౌకరున్నాడు. వాడికి అనేక విషయాలు తెలిసిఉంటాయి. రంగరాజును పట్టుకున్నందు కిస్తామన్న పదివేల బహుమానం వాడికే ఇస్తామని ఆశపెడితే. వాడు తనకు తెలిసినదంతా బయటపెట్టేస్తాడు. మన పని జరిగిపోతోంది."

"నిజమే ననుకోండి. కాని కరమ్చంద్ కింద అయిదువేలమంది అశ్వ సైనికు లున్నారు వారిలో ఎవడు ఉత్తరాన్ని తీసుకుపోయాడో మనకెలా తెలుస్తుంది ?"

"కరమ్చంద ఈ పనిని తన సన్నిహితుడైనవాడికి తప్ప ఇవ్వడు. అతనికి అభిమాన పాత్రుడైన నౌకరు ఎవడో తెలుసుకోవటానికి నలుగురైదుగురు చారులను వియోగించాను ఈ రహస్యం కరమ్చంద్ ఆగ్రహానికి గురిఅయిన నౌకర్లద్వారా చాలా సులువుగా తెలుస్తుంది. ఉత్తరం చేరవేసినవాడు తేలికగానే దొరుకుతాడు. వాడు దొరికాక డబ్బాశకొద్దీ అంతా చెప్పేస్తాడు. వాడిద్వారా వాడి యజమానిని నిర్మూలించ గలుగుతాం. నిజం చెప్పినందువల్ల వాడికేవిధమైన నష్టమూ ఉండదని మనం తెలియజెప్పాలి."

ఇలా-కొంతసేపు మాట్లాడి మల్హారిరావు పడుకోవటానికి వెళ్ళిపోయాడు.

తరవాత పదిపన్నెండు రోజులకు, తగిన సమయం చూసి. ఆయన బాజీరావుకు చంద్రరావుకిల్లావద్ద జరిగిన సంఘటనలన్నీ. రహస్యంగా తెలిపాడు. అంతా విని బాజీరావు రఘునాథుణ్ణి మెచ్చుకున్నాడు. ఈ మధ్యకాలంలో మల్హారిరావు దొంగల నాయకుణ్ణి చాలాసార్లు చూశాడుగాని, అందువల్ల ఏమీ ప్రయోజనం లేకపోయింది.

కరమ్చంద్‌వద్ద గిరిధర్లాలనే నమ్మకమైన భృత్యు డొకడున్నాడు. గూఢచారులు వాణ్ణి పసిపట్టి, రహస్యంగా మల్హారిరావింటికి తెచ్చారు. మల్హారిరావడిగిన ప్రశ్నలకు గిరిధర్లాల్ మొట్టమొదట తనకు దొంగలసంగతి ఏమీ తెలియదని చెప్పాడు; పది

వేల రూపాయల బహుమానాన్ని నిష్కారణంగా ఎందుకు పోగొట్టుకుంటావని మల్హారిరావన్నమీదట, "నావల్ల అంతా తెలుసుకుని, అతనికి సహాయం చేసినందుకు నా తల తీస్తాడేమో," అన్నాడు.

"నిన్నెందుకు శిక్షిస్తారు? సైన్యాధిపతి ఆజ్ఞను శిరసావహించావు. అది నీధర్మం. యజమాని చెప్పినమాట వినకపోతే శిక్షిస్తారుగాని, విన్నందుకు శిక్షించరు. అది అలాఉంచి, దొంగను పట్టుకున్నందుకు పదివేలు బహుమానం వస్తుంది. నౌకరీ, చాకిరీ చెయ్యకుండా హాయిగా బతకవచ్చు. అదీగాక కుట్రచేసేవారు వేరేఉన్నారు. నీపని ఉత్తరాలు చేరవెయ్యటమేనాయె. ఆ ఉత్తరాల్లో ఏముస్నదీ నీకేంతెలుసు? కరమ్చంద్ చేసినతప్పుకు నిన్ను దండించటం తప్పుకాదా. నేను చెప్పినట్టు నడుచు కున్నావంటే నీకు శిక్షపడదు సరేకదా, కరమ్చందుకూడా నిన్నేమీ చెయ్యలేడు."

"మీరుచెబితే నాకు నమ్మకమే. ఏం చెయ్యమంటారో చెప్పండి."

"అయితే ఆ పదివేలూ నీవన్నమాటే। దొంగలనాయకుడి దగ్గిరికి ఉత్తరం పట్టుకెళ్ళిందెవరు?"

"కరమ్చంద్ పట్టుకెళ్ళమంటే నేనే పట్టుకెళ్ళాను."

"రంగరాజును ఎన్నిసార్లుచూశావు? గుర్తించగలవా?"

"ఆరేడుసార్లు చూశాను. గుర్తించగలను."

"ఏసందర్భంగా అతన్ని చూశావు?"

"ఉత్తరా లియ్యటానికే. చంద్రరావుకిల్లా నుంచి తిరిగివచ్చేటప్పుడు రెండు, మూడుసార్లు అతను కరమ్చంద్‌కు డబ్బుకూడా పంపాడు

"ఎంత పంపాడు?"

"ఒకసారి వెయ్యి. ఇంకోసారి అయిదువందలూనూ."

"డబ్బేనా. లేక ఉత్తరాలుకూడా పంపేవాడా?"

"ఉత్తరాలుకూడా పంపేవాడు."

"వాటిని కరమ్చంద్ చదివేటప్పుడు దగ్గిర ఎవరుండేవారు?"

"ఉత్తరాలు తెచ్చి ఇవ్వటమేకాని, వాటిని ఆయన చదువుతుండగా నేనెన్నడూ చూడలేదు."

"కరమ్చంద్ ఈ ఉత్తరాల నెక్కడ దాస్తాడో నీకు తెలుసా?"

"ఆయన విశ్రాంతి గృహంలో. గోడలో తాపడంచేసిన ఇనప పెట్టెలో ఉత్త రాలు జాగ్రత్తగా దాయబడి ఉంటాయి."

"కరమ్చంద్ దొంగల నాయకుడికి పంపే ఉత్తరాలు ఎవరిచేత రాయించేవాడో నీకేమైనా తెలుసా ?"

"నాకు తెలీదు. ఆయన ఉత్తరాలు రాయిస్తుండగా నేను చూడలేదు. కరమ్చంద్ దగ్గిర గణేసుడి ముద్ర ఒకటి ఉన్నది. పంపించే ఉత్తరాలమీద ఆయన ఆ ముద్ర వెయ్యటం చూసాను."

మల్హారిరావు లేచివెళ్ళి దొంగదగ్గిర దొరికిన ఉత్తరం తీసి, దాని వెనక గణేసు ముద్ర ఉండటం గమనించాడు. ఆయన ఆ ఉత్తరాన్ని గిరిధర్లాల్‌కిచ్చి, "బాగాచూసి ఈ దస్తూరీ ఎవరిదో చెప్పు," అన్నాడు.

"ఇది ఎవరి దస్తూరీయో నేను చెప్పలేనుగాని, కరమ్చంద్‌ది మాత్రంకాదు. అన్నాడు గిరిధర్లాల్

"నేనూ ఆ మాటే అనుకున్నాను. అటువంటి మోసకారి సొంతాన ఎన్నటికీ రాయడు. అయితే ఈ గణేశుడి ముద్ర ఎక్కడ ఉండేదీ తెలుసా ?"

"అది కూడా ఆ ఇనప్పెట్టెలోనే ఉంటుంది. దానిలో నుంచి ఆ ముద్రను ఆయన తీయటం చాలాసార్లు చూశాను."

"చూడు, ఇక నువు తిరిగివెళ్ళక, ఇక్కడే ఉండిపో. నువ్వెక్కడ ఉన్నదీ పిట్టకైనా తెలియ గూడదు. పదివేలూ పుచ్చుకున్నాక నీ యిష్టం వచ్చిన చోటికి వెళ్ళవచ్చు. నువ్విలా చేశావని కరమ్చందుకు కోపం వస్తుంది. కాని నిన్నేమీ చెయ్యలేడు. ప్రపంచంలో ఎవరి లాభం వాళ్ళు చూసుకుంటారు. అతను తన లాభం కోసం నిన్ను సింహం గుహలోకి పంపాడు. నీ వల్ల లాభం లేనినాడు నిన్ను గడ్డి పరక కింద లెక్కించి, తన్ని తగలేస్తాడు."

మల్హారిరావు చెప్పినవిషయాలు బాగా ఆలోచించి గిరిధర్లాల్ ఆయన చెప్పినట్టు చెయ్యటానికి అంగీకరించాడు. మల్హారిరావు అతను ఉండటానికొక గది ఏర్పాటుచేసి, అతన్ని అందులో ఉంచి, బయట తాళం పెట్టేశాడు.

ఈ సంగతులన్నీ మల్హారిరావుద్వారా తెలుసుకున్నమీదట రఘునాథుడాయన ప్రజ్ఞకు ఆశ్చర్యపడి, "పాపం, మనకు అన్నివిషయాలూ చెప్పిన గిరిధర్లాలును ఖైదీగా ఉంచావెందుకూ ?" అని అడిగాడు.

"నమ్మరానివాడి మనసు ఏ క్షణాన ఎలాఉంటుందో ఎవరు చెప్పగలరు ? డబ్బు కోసం తన యజమాని రహస్యాలు బయటపెట్టినవాడు మనసంగతి మరొకరికి చెప్పడని ఏమిటీ ? అందుచేత వాణ్ణి మనఎదుదటనుంచి అవతలికి పోనివ్వటం మంచిది కాదు." అన్నాడు మల్హారిరావు.

"తనను నమ్మిన యజమానికి అపకారం జరుగుతుందని సంకోచం లేనివాడు మనకు ఉపకారం చేస్తాడని నమ్మేదెలా ?"

"ప్రస్తుతం మనం వీణ్ణి నమ్మవచ్చు. ఏమంటే, ఖాజీరావు బహుమానం ప్రకటించాడనీ, ఆయన తనను శిక్షించడనీ వాడికి రూఢిగా తెలుసు. కరమ్‌చంద్‌కు నమ్మిన బంటుగా ఉండి, వాడు ఒక్క రూపాయి సంపాదించలేదు. కరమ్చందుకు ద్రోహం చేస్తే ఒక్కసారిగా పదివేల రూపాయలు వస్తాయి. తన యజమానికి అపకారం జరిగితే వాడికేం నష్టం?"

## 7

రఘునాథుడు మధ్యాన్నం భోజనం చేసి కూర్చొని ఉండగా నౌకరు ఒక ఉత్తరం తెచ్చి అతనికిచ్చి, "ఎవరో బ్రాహ్మణుడు మీ కీ ఉత్తరం ఇయ్యమని ఇచ్చి వెళ్ళిపోయాడు." అని చెప్పాడు. రఘునాధుడు ఉత్తరం విప్పి ఇలా చదువుకున్నాడు.

"శ్రీయుత రఘునాథరాయలకు శతసహస్రాశీర్వచనాలుచేసి విన్నవించేదేమనగా తమ దర్శనార్థం చాలా రోజులుగా నేను దేశదేశాలు తిరిగి, చివరకి మహారాష్ట్ర దేశంలో తమరిని చూడగలిగాను. నివురుగప్పిన నిప్పులాగా తమరు మారువేషంలో ఉన్నప్పటికీ తమ తేజస్సు ఏమీ తరగలేదు. తమరిని తేలికగానే పోల్చగలిగాను. నేను వచ్చిన కారణం తమతో సమక్షాన చెప్పుకోవలసినదే గాని, ఉత్తరంలో చెప్పేదికాదు. నా రాక రహస్యంగా ఉండవలసిన అవసరమున్నది. అందుచేత, ఈ పట్టణానికి సుమారు మూడుకోసుల దూరంలో, చందనవనం మధ్య ఉన్న పురాతన దేవాలయానికి, రాత్రి పదకొండుగంటలు దాటి తమరు వచ్చినట్టయితే నేనక్కడ తమకోసం ఎదురు చూస్తూ ఉంటాను. నేను ఎన్నో శ్రమలుపడి ఈ దేశానికి వచ్చాను. కనుక తమరు రావటం మానవద్దు.

తమ హితైషి,
పూర్వపరిచితుడు."

ఉత్తరం చదవగానే రాఘునాథుడి ఆలోచనలు పరిపరివిధాల పోయాయి. అది ఎవరు రాసి ఉంటారు ? ఆ మనిషి కష్టపడి ఇంతదూరం దేనికి వచ్చిఉంటాడు ? ఆలోచిస్తే భయమూ, సందేహమూ కూడా కలుగుతున్నాయి. అయినా ఇది మల్హారిరావుతో చెప్పదగిన సంగతి కాదు. చెబితే సమస్తమూ చెప్పవలసి వస్తుంది. దాచి పెడితే మోసమవుతుంది. ఎంతో స్నేహభావంతో ఉంటున్న ఆ పెద్దమనిషి మనసులో అనుమానం తలఎత్తి, నమ్మకం నశించిపోతుంది. అందుచేత రాత్రిదాకా వేచి ఉండి, ఆ దేవాలయానికి వెళ్ళటమే కర్తవ్యం.

ఆ రాత్రి పది గంటలకు, అందరూ నిద్రపోతున్న సమయంలో, రఘునాథుడు పక్కమీదినుంచి లేచి, ఒక్క ఖడ్గం మాత్రం తీసుకుని, చల్లగా బయటికి వచ్చి, మూడుకోసుల దూరాన, చందనవనం సమీపంలో ఉన్న ఏకలింగేశ్వరుడి పురాతన మందిరానికి బయలుదేరాడు. అతను అరణ్యం మధ్యగా నడిచి ఏకలింగేశ్వరస్వామి ఆలయం చేరుకుని అక్కడ కూర్చున్నాడు. వెన్నెల కాస్తున్నది. ఆలయానికి ఎటు చూసినా సమీపంలో గ్రామమేదీ లేదు. అరణ్యంలో ఒక చిన్న కుటీరంలో పూజారి ఉంటాడు. ఆలయం చుట్టూ ఒక మైలుమేర చందనవనం ఉన్నది.

ఉత్తరం చూడగానే రఘునాధరాయలు, మల్హారిరావుతోనైనా చెప్పకుండా, ఒంటరిగా, ఈ రాత్రి వేళ, సాహసించి, ఈ నిర్జనస్థలానికెందుకు రావాలి? ఇది మనం సులువుగానే ఊహించవచ్చు.

అతను ఆలయప్రాంగణంలో కూర్చుని చుట్టూ కలయజూశాడు. సమీపంలో ఒక పెద్ద మర్రిచెట్టూ, దాని కింద విశాలమైన అరుగూ ఉన్నాయి. వేరే చెట్లేమీ ఆ ఆవరణలో లేవు. ఆ మర్రిచెట్టు దిక్కునుంచి ఒక మనిషి తనకేసి వస్తూండటం చూసి రఘునాథుడు మొదట ఆనందం చెందాడు. కాని అంతలోనే ఆనందం ఇగిరిపోయింది. ఎందుకంటే, ఆ వచ్చేవాడు యుద్ధసన్నద్ధుడై, ఖడ్గ హస్తుడై కనిపించాడు. రఘునాథుడు కూడా వెంటనే తన కత్తిని ఒరనుంచి తీశాడు.

వచ్చేవాడతనితో, "సలాం రాయ్‌జీ! నీ కోసం చాలా సేపుగా కనిపెట్టుకుని వున్నాను. నన్ను నాశనం చెయ్యటానికి మంత్రిగారబ్బాయితో కలిసి మహా ప్రయత్నం చేస్తున్నావు. మారు వేషంలో ఉన్న విదేశీయుడవైన నువు బాజీరావు కళ్ళలోనే దుమ్ము చల్లావు. తెలివిగలవాడివే గాని, నీ తెలివి మా దగ్గిర పారలేదు అందుకే నిన్ను ఒంటరిగా రప్పించటానికి అలా ఉత్తరం రాయవలిసి వచ్చింది. ఇంక నిన్ను నిర్మూలించటమే తరవాయి," అన్నాడు.

ఆ మనిషి ఎవరో రఘునాధుడికి తెలిసిపోయింది.

"ఓరి పాపాత్ముడా! కరమ్చంద్! నీకు నేను కలలో కూడా అపకారం చెయ్యకపోయినా, నన్ను చంపటానికిన్ని ఎత్తులు వేస్తున్నావు!" అన్నాడతను.

"ఔను, వేశాను. నేను పైకి రాకుండా నువ్వు అడ్డపడ్డావు. నిన్ను తొలగించుకోవాలి. నువు ఒకాపదనుంచి తప్పించుకుని రంగరాజును ఖైదీగా పట్టావు. కాని నా కేమీ భయంలేదు. పీక తెగగోసినా రంగరాజు ఒక్క మాట బయటపెట్టడు. కాని మీ చేతికి చిక్కిన నా సేవకుడి వల్ల చాలా ప్రమాదమున్నది. ఆ ప్రమాదం నుంచి బయట పడాలంటే నిన్ను చంపాలి."

ఇలా ఇద్దరూ పరస్పరం నిందలు చేసుకుంటూండగానే, కరమ్చంద్, "కాసుకో!" అంటూ రఘునాథుడిపైకి లంఘించాడు. ఇద్దరూ సమఉజ్జీలుగా కత్తియుద్ధం చేస్తున్న సమయంలో, మరొకడు మర్రిచెట్టునుంచి దిగివచ్చి, కరమ్చందుకు సహాయంగా రఘునాథుడితో యుద్ధం ఆరంభించాడు. ఆ మనిషి ముఖానికి నల్లరంగు పూసి ఉండటంచేత, అతణ్ణి రఘునాథుడు గుర్తించలేకపోయాడు. ఇద్దరు ఖడ్గధారులతో యుద్ధం చెయ్యవలసి వచ్చేసరికి రఘునాథుడు కొంచెం భయపడ్డాడు. వాళ్ళిద్దరూ బాగా యుద్ధం చెయ్యగలవారే. వారినుంచి అతను ఎంతసేపు ఆత్మరక్షణ చేసుకోగలడు?

రఘునాథుడు రెండుమూడు చోట్ల గాయపడి రక్తం కోల్పోసాగాడు తల తిరిగిపోతున్నది. పిడికిలిలో బలం తగ్గుతున్నది. స్పృహ తప్పిపోతున్న సమయంలో ఎత్తునుంచి అతను చాలాలోతున ఉన్న నీటిలో పడిపోయాడు. ఆ పల్లంలో ఉన్న నీరు వర్షపునీరు. అది నర్మదానది వరదనీటితో కలిసి ప్రవహిస్తున్నది.

అతను వరదనీటిలో పడిపోయిన చప్పుడు వినగానే అతన్ని చంపవచ్చిన వారిద్దరూ పరమానందం చెందారు. రఘునాథుడింక చచ్చినవాడేననీ, అతని శవాన్ని పూడ్చిపెట్టే పనికూడా లేదనీ వాళ్ళనుకున్నారు. తమపని ముగిసిందనుకుని వాళ్ళు వెళ్ళిపోయారు.

అయితే వాళ్ళూహించినట్టుగా జరగలేదు. రఘునాథుడు నీటిలోపడి, పది పన్నెండుగజాల దూరంలోఉన్న ఒక పడవకేసి కొట్టుకుపోసాగాడు. అతనికి ఈదే శక్తి లేదుగాని, తేలి ఉండటానికి ప్రయత్నించాడు.

ఆ పడవలో ఒక బ్రాహ్మణుడు తన భార్యతోసహా ప్రయాణం చేస్తున్నాడు. ఆయనకూడా నీటిలో చప్పుడుకావటం విని, వెన్నెలలో పరికించిచూసి, మనిషి కొట్టుకు వస్తుండటం గమనించి పడవవాళ్ళ సహాయంతో రఘునాథుణ్ణి పైకి తీయించాడు. తరవాత ఆయన రఘునాథుడి తడిబట్టలు తీసేసి, అతని గాయాలు కడిగి, కట్లుకట్టి, తాగిన నీళ్ళు వమనం చేయించి, తన భార్య సహాయంతో తైలం కాయించి, అతని శరీరమంతా కాపటం పెట్టించాడు. ఈ విధంగా చేసినమీదట రఘునాథుడి ప్రాణాలు కొంత కుదటపడ్డాయి.

పూజారి జనార్దన అధికారి ఉండే గుడిసె ఆ ప్రాంతాలలోనే ఉన్నది. ఆ చుట్టుపట్ల ఉండే అరణ్యమంతా అతనిదే. శివాజీ మహారాజు దాన్ని నీలాంబర అధికారి అనే అర్చకుడికి దేవుడి మాన్యంకింద పూర్వం దానంచేశాడు. శివాజీ ఏ యుద్ధానికి బయలుదేరినా ఏకలింగేశ్వరుడికి పూజచేసి, నీలాంబరుడి ఆశీస్సు పొంది, విజ

యం సాధించేవాడు. అందుచేత ఆ కాలంలో ఈ ఆలయానికి గొప్ప ఖ్యాతి ఉండేది. నీలాంబరుడు బ్రహ్మచారి కావటంచేత పూజారి పదవి అతని శిష్యుడికి సంక్రమించింది. అదిమొదలు ఏకలింగేశ్వరార్చకులకు పెళ్ళిలేదు శిష్య పరంపరలో వారు పూజారులుగా ఉంటున్నారు.

ప్రస్తుతం పూజారిగా ఉంటున్న జనార్ధనుడు పదేళ్ళ వయసున వచ్చి వెనకటి పూజారికి శిష్యుడై, ఆయన అనంతరం పూజారి అయాడు. శివాజీ అనంతరం ఏకలింగేశ్వరస్వామి ప్రతిభ తగ్గిపోయింది. అయినప్పటికీ అరణ్యం మీదనుంచి రాబడి ఉంటున్నది. వర్తకులు బోలెడంత డబ్బిచ్చి, చందనం చెక్క కొనుక్కుంటారు. అరణ్యం నుంచి బోలెడంత వంటచెరుకూ, తేనే, ఫలాలూ వస్తాయి. వాటితో స్వామికి నివేదన ఏలోటూ లేకుండా జరిగిపోతున్నది. జనార్ధనుడు తాను నిశ్చింతంగా జీవించటమేగాక, ఇద్దరు నౌకర్లను కూడా పోషిస్తున్నాడు. ఆయన పగలొకసారీ, సాయంకాలం ఒకసారీ గుడితెరిచి, పూజచేసి, ధూపదీపాలు పెడతాడు. రాత్రిపూట గుడి ప్రాంతం నిర్జనంగా ఉంటుంది. ఆ సంగతి కరమ్చందుకు తెలిసి, రఘునాథుణ్ణి అక్కడ చంపెయ్యాలని ఎత్తువేశాడు.

రఘునాథుణ్ణి రక్షించిన బ్రాహ్మడు పూజారికి బాల్యమిత్రుడు. ఆయన భార్యాసహితుడై రామేశ్వరయాత్రచేసి తిరిగివస్తూ, పూజారిని చూడటానికి ఇటుగా వచ్చి, పొద్దుపోవటం చేత ఆ రాత్రి పడవలోనే గడిపి, తెల్లవారి పూజారి ఇంటికి పోదామనుకున్నాడు. అది రఘునాథుడికి మేలయింది.

తెల్లవారగానే పడవలో ఉండే బ్రాహ్మడు ఒడ్డుకు వెళ్ళి పూజారితో తిరిగి వచ్చాడు. పూజారి రఘునాథుణ్ణి ఒకటి రెండుసార్లే నగరంలో చూశాడు. అయినా అతను పీష్వా ఆదరణ పొంది, గొప్ప పదవిలోఉన్నవాడని పూజారికి తెలుసు. పీష్వా అభిమానించిన మనిషి అంటే సామాన్యుడై ఉండడు. అందుచేత అలాటివాడి ప్రాణాలు కాపాడటం అత్యవసరం. అయితే అతన్ని ఎవరో చంపయత్నించినట్టు గాయాలవల్ల స్పష్టమవుతున్నది. అతనికి ప్రబలశత్రువులుండి ఉండాలి. వారుకూడా గొప్ప హోదాగలవారే అయి ఉంటారనుకోవాలి. అందుచేత ఈ గాయపడిన వ్యక్తిని కాపాడిన సంగతి ఎంతో రహస్యంగా ఉంచవలసిన అవసరం కూడా ఉన్నది. ఈ మనిషి ఇంతలో కోలుకోలేడు. గాయాలకు చికిత్స జరగాలి. వాటిమూలంగా జ్వరం వస్తుంది. దానికీ వైద్యం జరగాలి.

"నా పడవలో మందులు లేవు పథ్యపానాలకు తగిన వస్తువులు లేవు. ఏం చెయ్యాలి?" అన్నాడు తీర్థయాత్రలు చేస్తున్న బ్రాహ్మణుడు.

"ఇతన్ని మా ఇంటికి తీసుకుపోదాం, నా దగ్గిర ఇద్దరు నౌకర్లున్నారు. కావల సిన వస్తువులన్నీ తెస్తారు." అని చెప్పి పూజారి తన ఇంటికివెళ్ళి, నౌకర్లనూ ఒక మంచాన్నీ తెచ్చాడు. దానిమీద రఘునాథుణ్ణి పూజారి ఇంటికి చేర్చారు. జనార్ధన పూజారికి కొంత వైద్యం తెలుసు, రోగికి కావలసిన చికిత్స ఆయనే చేశాడు.

మధ్యాన్నం దాటినాక రఘునాథుడికి తీవ్రంగా జ్వరంవచ్చి, సంధించింది. పూజారి దగ్గిర ఉండి మందులిస్తూ వచ్చాడు.

## 8

గాయపడి నీటిలో పడిపోయిన రఘునాథరాయలును కాపాడిన బ్రాహ్మణ దంపతుల గురించి కొంత తెలుసుకోవటం అవసరం. ఆ బ్రాహ్మడి పేరు అచ్యుత కుమార మిశ్రుడు. అతను పూర్వం బెంగాలులోని శాంతిపురానికి చెందినవాడు. అతను తన పందొమ్మిదో ఏటివరకూ స్వగ్రామంలోని వేద పాఠశాలలో చదువు పూర్తిచేసి,వేదాంత దర్శనాలు చదవటానికి కాశీ వెళ్ళాడు. ఇప్పుడు జనార్దను డని పేరు మార్చుకున్న పూజారికూడా శాంతిపురంవాడే. అతనుకూడా చదువుకోసం కాశీ వెళ్ళాడు. అప్పుడతని పేరు కృష్ణకమల భట్టాచార్యుడు. కృష్ణకమలుడు కాశీలో ఎక్కువకాలం ఉండక, వైరాగ్య మవలంభించి, ఎవరితోనూ చెప్పకుండా బయలు దేరి, చాలా దేశాలు తిరిగి చివరకు ఇక్కడికి చేరి, పాత పూజారివద్ద శిష్యుడై, ఆయన అనంతరం తానే పూజారి అయాడు.

కొంతకాలం గడిచాక కంఖాల నుంచి బ్రహ్మానంద మిశ్రుడు — శ్రీని తన ఇంట ఉంచుకున్నవాడు — కాశీకి వెళ్ళి, అక్కడ అచ్యుత కుమార మిశ్రుడి విద్యాబుద్ధులు చూసి సంతోషించి అతన్ని తనవెంట కంఖాలకు తీసుకువచ్చి, తన కుమార్తెను సుబాలనిచ్చి పెళ్ళి చేశాడు. పెళ్ళి అయిన కొద్ది కాలానికి అచ్యుత కుమార మిశ్రుడు తన భార్యతోసహా కంఖాలనుంచి బయలుదేరి కాశీకి తిరిగివచ్చి అక్కడే కాపరం పెట్టాడు.

రెండు సంవత్సరాలు గడిచాక అతనికి తన బాల్య స్నేహితుడైన కృష్ణకమలుడి వద్ద నుంచి ఉత్తరం వచ్చింది. తాను పేరు మార్చుకున్నా నని, అచ్యుతకుమార మిశ్రుడు ఒకసారి వచ్చి తనను చూసి వెళ్ళాలని కృష్ణకమలుడు రాశాడు. ఆ ఉత్తరం చూసి అచ్యుతకుమారుడు పరమానంద భరితుడై, తన బాల్య మిత్రుణ్ణి చూడ నిశ్చయించాడు.

మరికొంత కాలానికి అతను భార్యతో సహా రామేశ్వర యాత్రచేసి, అక్కడి

నుంచి తిరిగి వచ్చే దారిలో తన స్నేహితుణ్ణి చూసే ఉద్దేశంతో ఒక పడవను మాట్లాడుకుని ఈ ప్రాంతానికి వచ్చాడు. తరవాత జరిగిన సంగతులు మనకు తెలిసినవే.

నాలుగు రోజులపాటు రఘునాథుడు మూసిన కన్నెరగడు. అంతకాలమూ అతనికి పూజారి మందులిస్తూనే వచ్చాడు. సుబాలా, ఆమె భర్తా కూడా అతన్ని కని పెట్టుకుని ఉన్నారు. అయిదోరోజు అతను కళ్ళు తెరచి చూసేసరికి అపరిచితమైన సుబాల ముఖం కనిపించింది.

"అమ్మా, మీ రెవరు ?" అని రఘునాథు డామెను అడిగాడు. ఆమె జవాబు చెప్పటానికి సిగ్గుపడింది.

రఘునాథుడు కళ్ళు మూసుకుని తనకు తెలిసిన ఆఖరు ఘటనలన్నిటినీ జ్ఞాపకం చేసుకుని, తనకు కరమ్చంద్ చేతిలో చావు వెంట్రుకవాసిలో తప్పిపోయినట్టు గ్రహించాడు.

అంతలోనే పూజారీ, అచ్యుతకుమార మిశ్రుడూ ఎక్కడి నుంచో తిరిగివచ్చారు.

"మీ రెవరు ? నే నెక్కడ ఉన్నాను ?" అని అతను వారి నడిగాడు.

పూజారి జనార్దను డతనితో, "నేను ఏక లింగేశ్వరస్వామి పూజారిని. అయిదు రోజుల క్రితం ఈ నా మిత్రుడు తన భార్యతో సహా నన్ను చూడటానికి పడవలో వస్తూ, ఆ రాత్రివేళ నిద్రలో పెద్దచప్పుడు విని లేచి, మీరు నదిలో పడిన సంగతి తెలుసుకుని, మిమ్మల్ని పైకి తీశాడు. అప్పుడు మీకు స్పృహలేదు. తరువాత మిమ్మల్ని ఇక్కడికి తెచ్చాం. ఇది నా ఇల్లు. ఇన్నాళ్ళూ మీకు మేం మందులూ మాకులూ ఇస్తున్నాం అదృష్టవశాన మందులు పనిచేశాయి. మీరు మళ్ళీ కళ్ళు తెరిచి మాట్లాడుతుంటే మా కెంతో సంతోషంగా ఉంది. మీ రెవరో, మీ కీ ఆపద ఎలా కలిగిందో వినాలని ఉంది," అన్నాడు.

"మీరు నాకు చేసిన మేలు ఎన్నటికీ మరవలేను," అని రఘునాథుడు వారు ముగ్గురికీ కృతజ్ఞత తెలుపుకుని జరిగినదంతా వారికి చెప్పాడు,—అయితే బాజీరావు వద్ద దాచిపెట్టినట్టే తాను మొదట ఎవరైనదీ దాచిపెట్టాడు.

వారలా మాట్లాడుకుంటూ ఉండగానే గుర్రాలు కుటీరంకేసి వస్తున్న చప్పుడు వినిపించింది. పూజారి బయటికి వెళ్ళాడు. సుబాల వంటఇంట్లోకి వెళ్ళింది. అచ్యుత కుమారమిశ్రుడు రఘునాథుడి దగ్గిరే కూర్చున్నాడు. వస్తున్న వారెవరో అని రఘునాథుడు భయపడ్డాడు.

అయితే త్వరలోనే ఆభయం పరమానందంగా మారింది; మల్హారిరావు కొడుకు

ద్వార నాథుడు లోపలికి వచ్చాడు. రఘునాథుడి దుస్థితిని చూడగానే అతని కంటనీరు తిరిగింది. రఘునాథు డతన్ని తన దగ్గిర కూర్చోమని, "తమ్ముడూ, విచారించకు. దేవుడి దయవల్లా, ఈ మహాత్ముల అనుగ్రహంవల్లా ప్రాణాలతో ఉన్నాను. ముందు నీ సమాచారం చెప్పు. తరవాత నా సంగతి చెబుతాను," అన్నాడు.

పట్టణంలో జరిగిన విషయాలన్నిటినీ ద్వారకనాథుడు చెప్పాడు.

రఘునాథుడు కరమ్చంద్ వేసిన ఉచ్చులోపడి ఆలయంవద్దకు వచ్చిన మర్నాడు ఉదయం అతను గదిలో లేకపోవటం చూసి మల్హారిరావు మొదలైన వారాశ్చర్య పడ్డారు. పొద్దెక్కినకొద్దీ వాళ్ళకు భయం పట్టుకున్నది. సేవకుల నడిగితే, ఒక్కరికీ రఘునాథుడి జాడతెలియలేదు. ఈ సంగతి పీష్వాదాకా వెళ్ళింది. రఘునాథుణ్ణి వెతకటానికి ఆయన అన్నివైపులకూ మనుషులను పంపాడు. కాని ఫలితం లేకపోయింది. పట్టణమంతా కలవరం లేచింది.

రెండురోజులు గడిచాక మూడోనాటిరాత్రి మల్హారిరావు కరమ్చందు మనిషిని రహస్యంగా బాజీరావువద్దకు తీసుకుపోయి, కరమ్చంద్ చర్యలనుగురించి పూర్తిగా చెప్పించాడు. వాడుకూడా ఏమీ దాచకుండా అంతా చెప్పాడు. పీష్వా ఆగ్రహావేశంతో ఆ రాత్రికి రాత్రే సైనికులను తీసుకుపోయి కరమ్చందు ఇల్లు ముట్టడించి సోదాచేశాడు. ఇనపపెట్టెలో దొంగల సర్దారు రాసిన ఉత్తరాలూ, గణేశుడి ముద్రికా దొరికాయి. కరమ్చందు నేరం ఆధారసహితంగా రుజువయింది. ఆ రాత్రే కరమ్చందును కారాగృహంలో పెట్టారు. రఘునాధు డీ విషయం ఏమైనా చెబుతాడేమోనని నయానా, భయానా యత్నించారు. కాని కరమ్చందు ఒక్క ముక్కకూడా చెప్పక, తనకేమీ తెలియదనేశాడు. రంగరాజునుకూడా మల్హారిరా వింటినుంచి ఖైదుకు మార్చారు. ఇద్దరినీ వేరువేరు గదులలో బేడీలువేసి ఉంచారు.

కిందటిరోజు మధ్యాన్నం మల్హారిరావు రఘునాథుడి పడకగది వెతుకుతుండగా పరుపుకింద ఒక ఉత్తరం దొరికింది. ఆ ఉత్తరం చదివిన మీదట రఘునాథుడు మాయమై పోవటానికి కారణం తెలిసింది. కాని ఆ ఉత్తరాన్ని ఎవరు రాసిందీ తెలియ రాలేదు. వెంటనే మల్హారిరావు బాజీరావు వద్దకు వెళ్ళి ఆ ఉత్తరం చూపించాడు. బాజీరావా ఉత్తరాన్ని చదివి, రఘునాథుణ్ణి 'నాశనం చెయ్యటానికి నిశ్చయంగా కుట్ర జరిగిందనీ, అందులో ఏకలింగేశ్వరస్వామి పూజారి కూడా చేరి ఉండవచ్చు ననీ, నీచుడైన కరమ్చందే ఆ బ్రాహ్మణ్ణి ఇందుకు నియోగించి ఉండవచ్చుననీ అనుకున్నాడు. ఆయన ద్వారకనాథుడితో, "నువు పూజారి వద్దకు వెళ్ళి, రఘునాథుడి సమాచారం అడుగు. అత నేమీ చెప్పకపోతే అతన్ని పట్టి తీసుకురా,"

అని ఆజ్ఞాపించాడు. రఘునాథుడు మళ్ళీ కళ్ళబడతాడన్న ఆశ ఏ మాత్రమూ లేకుండానే ద్వారకనాథుడు బయలు దేరివచ్చాడు. రఘునాథుడు. కనిపించగానే అతనికి ప్రాణం తిరిగి వచ్చినట్టయింది.

రఘునాథుడి విషయా లన్నీ విని, "బాజీరావు, మల్హారిరావుగారు ద్రోహిని చాలా నేర్పుగానే పట్టుకున్నారు గాని, మహాత్ముడైన ఈ బ్రాహ్మడి విషయంలో పొరపాటు పడ్డారు. ఈయన మూలానే నా ప్రాణాలు దక్కాయి. మనుషులలో రాక్షసులూ, దేవతలూ ఉంటారన్న విషయం ఆ ఒక్క రాత్రిలోనే రుజువయింది. పెద్దమ్మ నానెత్తిన కూర్చుని ఉండటం చేత మీ నాన్నగారితో కూడా చెప్పకుండా ఇల్లుదాటి రాత్రి వేళ బయలుదేరి వచ్చినందుకు తగిన శాస్తి పొందాను. తిరిగి ఆయన ముఖం ఎలా చూస్తానో తెలియకుండా ఉంది.'' అన్నాడు.

"అయిం దేదో అయింది. మిమ్మల్ని గురించి మా నాన్నగారు చాలా దిగులు పడి ఉన్నారు. మిమ్మల్నీ ఒక్కసారి చూస్తే గాని ఆయన విచారం పోదు. అసలు ఏం జరిగిందో దయచేసి చెప్పండి." అన్నాడు ద్వారకానాథుడు.

రఘునాథు డతనికి సమస్తమూ వివరంగా చెప్పాడు. అంతా విని ద్వారకనాథుడు, "నిశ్చయంగా కరమ్చంద్ తనగొంతు తానే కోసుకున్నాడు. మీ మీద చెయ్యి చేసుకోవటం మహాపరాధం. అతన్ని ఎవరూ రక్షించలేరు." అన్నాడు.

అతను బ్రాహ్మణులకు ధన్యవాదాలు తెలిపి, అందరూ రఘునాథుణ్ణి గురించి చాలా ఆందోళన చెందుతున్నారనీ, తాను శీఘ్రంగా వెళ్ళి వార్త అందించాలనీ చెప్పి, సెలవు తీసుకుని బయలు దేరాడు.

తరవాత రఘునాథుడు బ్రాహ్మలకు రంగరాజును పట్టుకున్న సందర్భం గురించి చెప్పాడు. ఇతను ఎవరో అసాధారణ వ్యక్తి అని వాళ్ళకు స్పష్ట మయింది. "అయితే, బాబూ, మీరు ఎక్కడో బెంగాలు నుంచి ఈ మహారాష్ట్ర దేశానికి రావటానికి కారణ మేమిటి ?'' అని వా రడిగారు. కాని అత నేమీ జవా బివ్వలేదు.

ఆ సాయంకాలం పూజారీ— అతని వెంట తన భర్త దేవాలయానికి వెళ్ళి ఉన్న సమయంలో సుబాల రఘునాథుణ్ణి, "అయ్యా, మీ దేవూరు ? మీ నివాస మెక్కడ ? మీ పిల్లలూ, బంధువులూ ఎక్కడ ఉన్నారు ?" అని అడిగింది.

ఆ ప్రశ్నకు అతని కళ్ళు చెమ్మగిల్లాయి. "అమ్మా, నా అదృష్టం తిరిగి, నాకు మంచిరోజు వచ్చిన నాడు నా కథ అంతా చెబుతాను. మీకూ నాకూ కలిగిన ఈ బంధం జన్మాంతం దాకా ఉండేదే. ప్రస్తుతం నేను ఏకాకిని, స్థానభ్రష్టుణ్ణి. ఇంత కన్నా ఇప్పుడేమీ చెప్పలేను." అంటూ జలజలా కన్నీరు కార్చాడు.

అతని భార్యా, బిడ్డో పోయి ఉంటుదనీ, వాళ్ళను తలుచుకుని అతను దుఃఖిస్తు న్నాడనీ సుబాల అనుకున్నది; అతనిమనస్సు తిప్పటానికి ఏదో లోకాభి రామాయణం మాట్లాడింది. వా రిద్దరూ తల్లికొడుకుల వరసలు ఏర్పాటు చేసుకున్నారు.

ఒకనాడు మల్హారిరావు రఘునాధుణ్ణి చూడవచ్చాడు రఘునాథుడాయన ముఖం చూడటానికి చాలా సిగ్గుపడ్డాడు. మల్హారిరావు అతనితో ప్రేమగానే మాట్లాడాడు. రఘునాథుడి ప్రాణాలు కాపాడినందు కాయన బ్రాహ్మణులమ ప్రశంసించి, విచారణ సమయంలో వారిద్దరూ వచ్చి సాక్ష్యం చెప్పవలిసి ఉంటుందన్నాడు. ఆయన రఘునాథుడితో, "నీపై కత్తిదూసిన రెండోవాణ్ణి నువు గుర్తించలేదనుకుంటాను. ఆ పాపి భాస్కరపండితుడే. వాడు ప్రస్తుతం ముప్పైవేల సేనతో బెంగాలు మీదికి దండెత్తి వెళ్ళాడు. వాడిపైన నేరం మోపటానికి ఒక్క ఆధారం కూడా సంపాదించ లేకపోయాను," అన్నాడు.

బెంగాలు ప్రజలు తిరిగి యుద్ధంలో నలిగి బాధపడబోతున్నందుకు రఘునాథుడు లోపల బాధపడుతూ దండయాత్రకు కారణమడిగాడు.

"బెంగాలు కొత్త సుబేదారు అలివర్దీఖాన్ మహారాష్ట్రులకు చౌథ్ కట్ట నిరాక రించాడు." అన్నాడు మల్హారిరావు. ఆయన కాస్సేపు మాట్లాడి వెళ్ళిపోయాడు.

ఆయన వెళ్ళి బాజీరావుకు అన్ని సంగతులూ చెప్పిన మీదట బాజీరావు రఘునా ధుడికి వైద్యం చెయ్యటానికొక ప్రసిద్ధ వైద్యుణ్ణి పంపాడు. ఆస్థానం నుంచి అనేక మంది రాజోద్యోగులు రఘునాథుణ్ణి చూసిపోవటానికి కానుకలతోసహా వచ్చారు.

కొద్ది రోజులలోనే రఘునాథుడు పూర్తిగా కోలుకున్నాడు. ఒకనాటి ఉదయం ద్వారకనాథుడు మూడు పల్లకీలతోసహా పూజారి ఇంటికి వచ్చాడు. భోజనాలయాక అతను పల్లకీలలో రఘునాధుణ్ణీ, పూజారినీ, అచ్యుత కుమారమిత్రుణ్ణీ ఎక్కించు కుని, తన వెంటవచ్చిన నౌకర్లను సుబాలకు తోడుగాఉంచి నగరానికి బయలుదేరాడు.

## 9

నేర విచారణ ఒక బహిరంగ ప్రదేశంలో జరిగింది. విచారణ చూడటానికి నగరవాసులందరూ ఆహ్వానించబడ్డారు. నేరస్థులైన రంగరాజూ, కరమ్చందూ న్యాయస్థానానికి తీసుకురాబడ్డారు. పీష్వా వా రిద్దరిపైనా ఆరోపించబడిన నేరాలను చెబుతూ, దొంగవృత్తి చేసుకుని జీవిస్తూ ప్రత్యక్ష రాజశత్రువుగా ఉన్న రంగ రాజు నేరం కంటే, రాజభృత్యుడుగా ఉంటూ రహస్యంగా రాజద్రోహం చేసిన కరమ్చంద్ నేరం ఎక్కువైనదన్నాడు.

కరమ్చంద్ తాను నిర్దోషిననీ, తాను ఎన్నడూ ఏ కుట్రా చెయ్యలేదనీ, మల్హారి

రావుకూ, తనకూ చాలాకాలంగా పడదనీ, అందుచేత ఆయన తనపైన నేరం మోపాడనీ. తాను పనిలోనుంచి తొలగించిన ఒక సేవకుణ్ణి రఘునాథుణ్ణి ఇందు కాయన ఉపయోగించుకున్నాడనీ అన్నాడు. బాజీరావు వేసిన ప్రశ్నలకు సమాధానం చెబుతూ అతను తాను దొంగకు ఉత్తరం రాయలేదన్నాడు; అలాగే రఘునాథుడికి తాను ఉత్తరం పంపలేదనీ, అతన్ని చంపటానికి యత్నించలేదనీ, తనకూ రఘునాథుడికీ మధ్య ఏలాటి వైరమూ లేదనీ, అతన్ని చంపినందువల్లతన కే లాభమూలేదనీ, అన్నాడు ఇలాటి అబద్ధాలతో పీష్వాకు అతని పైన మరింత మండిపోయింది.

గిరిధర్లాల్ సాక్ష్యం చెబుతూ, తనను కరమ్చంద్ ఉద్యోగంలో నుంచి తొలగించ లేదనీ, తానే మానుకున్నాననీ, రంగరాజు తన ద్వారా తన యజమానికి డబ్బు పంపేవాడనీ, తాను తన యజమాని నుంచి రంగరాజువద్దకు ఉత్తరాలు తీసుకు వెళ్ళేవాణ్ణనీ చెప్పాడు.

తరవాత పీష్వా, కరమ్చంద్ ఇంటదొరికిన దొంగలనాయకుడి ఉత్తరాలను సభలో చదివింపజేశాడు.

పూజారి సాక్ష్యం చెబుతూ, రఘునాథుడిపై హత్యాప్రయత్నం జరగటానికి 20, 25 రోజులు పూర్వం కరమ్చంద్ దేవాలయానికి వచ్చాడనీ, పూజ ఏ వేళలో జరిగేదీ, రాత్రి వేళ ఆలయం వద్ద ఎవరు పడుకునేదీ అడిగాడనీ, ఆ సమయంలో తనకేమీ సందేహం కలగలేదనీ తెలిపాడు.

సాక్షి విచారణ కూడా ముగిసినాక పీష్వా నేరస్థులను గురించి సభవారి అభిప్రాయం అడిగాడు. "దోషులు – దోషులు," అని అన్ని వైపులనుంచీ వినవచ్చింది. పీష్వా రంగరాజుకు మరణదండనా, కరమ్చంద్‌కు ద్వీపాంతరవాస శిక్ష విధిస్తూ, కరమ్చంద్‌కు గల సర్వస్వంలో సగం రఘునాథుడికి చెందుతుందనీ, మిగిలిన సగం రాజబొక్కసానికి చేరుతుందనీ చెప్పాడు. ఆయన బ్రాహ్మణు లిద్దరికీ చెరొక వెయ్యిన్నూటపదహార్లూ, బంగరుకంకణాలూ, దుశ్శాలువులూ, సుబాలకొక ఆభరణమూ బహుమానాలిచ్చాడు. గిరిధర్లాలుకు డబ్బివ్వటం మల్హారి రావు కేమాత్రమూ ఇష్టంలేదు, ఎందుకంటే వాడు నమ్మక ద్రోహి. అయినా వాడికి అయిదువంద లిచ్చారు, ఎంత వచ్చినా వచ్చినట్టే అనుకుని వాడు సంతోషించాడు,

రఘునాథుడు తిరిగి మల్హారిరా వింట ఉంటూ, అచ్యుత కుమారుణ్ణి, సుబాలనూ కూడా వచ్చి అక్కడే ఉండమని కోరాడు. వారలాగే చేశారు. రఘునాథుడు ఆ దంపతులను తనకు కొత్త జీవం ఇచ్చిన తల్లిదండ్రుల లాగా చూసుకుం టున్నాడు.

రోజులు సరదాగా గడిచి పోతున్నాయి.

ఒకనాడు సుబాల రఘునాథుడితో, "మా నాన్న హరిద్వారం దగ్గిర కంఖాలలో ఉంటున్నాడు. కాశీకి వెళ్ళేముందు ఒకసారి ఆయనను చూడా లనుకుంటున్నాను. త్వరలోనే బయలుదేరాలి," అన్నది.

రఘునాథుడు మాట వరసగా ఈ సంగతి చెప్పేసరికి మల్హారిరావు, "హరిద్వారం సమీపంలో ఒక ఆశ్రమంలో మా గురువుగా రున్నారు. ఆయనను చూసి చాలా ఏళ్ళయింది. ముసలివాణ్ణి. ఇంకా ఎంత కాలం ఉంటానో చెప్పలేను. నాకూ కూడా హరిద్వారం వెళ్ళాలనుంది. నువుకూడా నాతోబాటు తీర్థయాత్రకురా. నేను లేకుండా నువ్విక్కడ ఉండటం క్షేమంకాదు. కరమ్చంద్ లేకపోయినా అతని బంధువులూ, మిత్రులూ నగరంలో చాలామంది ఉన్నారు. వాళ్లు నిన్ను చంపాలని యత్నించవచ్చు." అన్నాడు.

రఘునాథుడు తీర్థయాత్ర వెళ్ళటానికి ఒప్పుకున్నాడు.

"నీకూ, నాకూ కొంత కాలం సెలవియ్యమని పీష్వా నడుగుతాను. మనం వెళ్ళినప్పుడు మన ప్రతినిధిగా ద్వారకథు డుంటాడు," అన్నాడు మల్హారిరావు.

"మీకు ద్వారకనాథుడు తప్ప వేరే సంతానం లేదా?" అని రఘునాథు డడిగాడు.

తనకు పిల్లలు లేకలేక ఎలా కలిగినదీ, తన మొదటి బిడ్డను ఈశ్వర కైంకర్యానికి నియోగిస్తా నని తాను మొక్కుకోవటమూ — మొదటగా తనకు ఆడపిల్ల కలగటమూ, ఆమెను తాను తనకు గురువుగారి కిచెయ్యటమూ మొదలైన విషయాలను మల్హారిరావు చెప్పాడు.

"ఆమె ఇప్పు డెక్కడ ఉన్నది? ఆమె వయస్సెంత ఉంటుంది? పేరేమిటి?" అని రఘునాథు డడిగాడు.

"ఎక్కడ ఉన్నదీ నాకుతెలీదు. వయస్సు సుమారు ముప్పై ఉండవచ్చు. ఆమెకు మా గురువుగారు జయంతి అని పేరు పెట్టినట్టు విన్నాను."

ఈ మాట వింటూనే రఘునాథుడి ముఖం పాలిపోయింది. అతని కళ్ళవెంట నీరు వచ్చింది. ద్వారకానాథుడి ముఖం మొదట చూసినప్పుడే అందులో అతనికి జయంతి పోలికలు కనిపించాయి. అందుకు కారణం ఇప్పుడు తెలిసింది. తన పట్ల ఇంత ప్రేమచూపుతున్న మల్హారిరావు కుమార్తెకే ఒకప్పుడు తాను దారుణమైన అవమానం తలపెట్టాడు. అది తలుచుకుంటే అతని మనసు దహించుకుపోయింది.

తరవాత రఘునాథుడు సుబాలతో, "నేమకూడా నీ వెంట మీ నాన్నగారిని

చూడటానికి వస్తున్నానమ్మా!" అన్నాడు. ఈ మాటవిని సుబాలా, ఆమె భర్తాకూడా ఎంతో సంతోషించారు.

మల్హారిరావూ, రఘునాథుడూ వెళ్ళిపోవటం పీష్వాకిష్టం లేదు. అయినా ఆయన వారికి మూడు మాసాలు సెలవిస్తూ, వారి ప్రయాణానికి కావలిసిన పల్లకీలూ, గుడారాలూ, సేవకులూ, పదార్థాలూ, సమస్తమూ ఏర్పాటు చేయించాడు.

వారు మంచిరోజు చూసి బయలుదేరి, ఇరవైఅయిదు రోజులు సుఖంగా ప్రయాణం చేసి, కంభాల చేరుకున్నారు. తన తండ్రిలాగే మల్హారిరావుకూడా రామానంద యోగికి శిష్యుడని దారిలో తెలుసుకుని సుబాల పరమానందం చెంది, ఆయనను "కక్కా" అని పిలవసాగింది. మల్హారిరావు బ్రహ్మానందమిశ్రుణ్ణి ఎరుగును గాని సుబాల ఆయనకూతురని ఎరగడు. ఆ సంగతి తెలియగానే ఆయన సుబాలను తన సొంత కూతురులాగే చూడసాగాడు.

వారు కంభాలకు దగ్గిరగా గుడారాలు వేసుకున్నారు. సుబాలా, ఆమె భర్తా మటుకు బ్రహ్మానందమిశ్రుడింటికి వెళ్ళారు. మిగిలిన వారంతా గుడారాలలోనే ఉండిపోయారు.

శ్రీ ఇప్పుడు రామానందస్వామి ఆశ్రమంలోనే ఉంటున్నది. జయంతి మాత్రం ఆశ్రమం నుంచి కంభాలకు వస్తూ, పోతూ ఉన్నది సుబాల వచ్చేముందు రోజే ఆమె బ్రహ్మానందమిశ్రుడింటికి వచ్చి ఉండటం వల్ల ఇద్దరూ కలుసుకున్నారు. వారిద్దరూ అక్కా చెల్లెళ్ళలాగా పెరిగినవాళ్ళు.

సుబాల జయంతికి అదీ ఇదీ చెబుతూ, "అన్నట్టు నేను కనకుండానే ఒక కొడుకును సంపాదించాను." అన్నది.

"అయితే మీ పిల్లవాడేడీ?" అని జయంతి అడిగింది.

"మాతోనే వచ్చాడు. ఊరిబయట మజిలీలో ఉన్నాడు. మా పిల్లవాడివెంట మల్హారిరావనే ఆయన ఉన్నాడు. వారిద్దరినీ తీసుకు రావటానికి నాన్న వెళ్ళాడు మధ్యానానికల్లా వచ్చేస్తారు. చూద్దువుగాని."

సుబాల అన్నట్టే మధ్యాన్నం వేళకు బ్రహ్మానందమిశ్రుడు మల్హారిరావునూ, రఘునాథుణ్ణీ వెంటబెట్టుకుని వస్తూ అంతదూరానే కనపడ్డాడు. సుబాల జయంతికి కిటికీలో నుంచి రఘునాథుణ్ణి చూపిస్తూ, "అడుగో మా అబ్బాయి!" అన్నది.

జయంతి నవ్వుతూ, "మరీ పసివాడల్లేఉండే? పేరేమిటి?" అన్నది.

"రఘునాథుడు."

"వివాహం?"

"బెంగాలీవాడే—బెంగాలులోనే ఎక్కడో ఉంటుంది. నాకా వివరాలు తెలీవు. వాటివి అడిగితేచాలు, కంటతడి పెట్టుకుంటాడు. తన సంగతంతా ఎప్పుడో ఒక నాడు చెబుతానన్నాడు. దానికోసమే నేనూ ఎదురు చూస్తున్నాను."

"ఆమాట నిజమే. నీ కొడుకు సంగతంతా త్వరలోనే తెలుస్తుంది. నీ కోడలు కూడా నీకు కనిపిస్తుందిలే."

జయంతి ఇలా అనటం సుబాల కాశ్చర్యం కలిగించింది. కాని అందుకు తగిన కారణం ఉండి ఉంటుందని ఆమె అనుకోలేదు.

మల్హారిరావు చాలాకాలానికి బ్రహ్మానందమిశ్రుణ్ణి చూశాడు వాళ్ళిద్దరూ సంతోషంగా మాట్లాడుకున్నారు. రఘునాథుణ్ణి మల్హారిరావు పరిచయం చేసినమీదట బ్రహ్మానందమిశ్రుడు వారిద్దరినీ తన ఇంటికి భోజనానికి పిలిచాడు. వారువచ్చి, భోజనంచేసి తిరిగి తమ గుడారానికి వెళ్ళిపోయారు. వాళ్ళువెళ్ళాక జయంతి బ్రహ్మానందుడికి రఘునాథుడి సంగతంతా చెప్పింది. బ్రహ్మానందమిశ్రుడు అద్భుతాశ్చర్యాలుపొంది, "ఈ సంగతి స్వామివారికి చెప్పు. ఆయనను చూడటానికి మల్హారిరావు వచ్చాడని కూడా చెప్పు. రహస్యాలన్నీ ఆయన ఎదటే వెల్లడి అవుతాయి. జరగవలసిం దేమిటో కూడా ఆయనే చెబుతారు. ఈ లోపుగా ఏ నిర్ణయం చెయ్యటానికీ నేను సమర్థుణ్ణి కాను. అందుచేత ఈ విషయాలు గోప్యంగానే ఉంచుతాను." అన్నాడు.

"నా అక్క ఇప్పుడు పూర్తిగా మారిపోయింది. ఆమెకు ఈ లోకపు కష్ట సుఖా లేవీ అంటవు. ఆమె మనస్సు పూర్తిగా ఈశ్వరుడిపైనే లగ్నమై ఉన్నది. అందుచేత ఆమె ఇతన్ని చూడదను కుంటాను," అన్నది జయంతి

"చెప్పకేం. ఇది పరీక్షా సమయం. మనకు ప్రియులైన వారు ఎదట లేనప్పుడు మనసును నిగ్రహంలో ఉంచటం తేలిక. కాని వాళ్ళు దగ్గిరికి వచ్చి నప్పుడే పరీక్ష. నువు స్వామి వారి వద్దకు వెళ్ళి. ఆయన చెప్పినట్టు చెయ్యి." అన్నాడు బ్రహ్మానంద మిశ్రుడు.

జయంతి సుబాలను చూసి, మూడు నాలుగు రోజుల్లో మళ్ళీ వస్తానని చెప్పి ఆశ్రమానికి వెళ్ళిపోయింది. తరవాత అయిదు రోజులకు ఆశ్రమం నుంచి రామానందస్వామి శిష్యుడొకడు వచ్చి, "మిమ్మల్నందరినీ స్వామివారు ఆశ్రమానికి రమ్మన్నారు," అని చెప్పాడు. సుబాలా, ఆమె తండ్రీ, భర్తా, మల్హారిరావూ, రఘునాథుడూ మర్నాడు తెల్లవారు జామునే బయలుదేరి ఆశ్రమానికి వెళ్ళారు. రామానందస్వామి దర్శనం కాగానే ఆయనకు సాష్టాంగ పడ్డారు.

రామానందస్వామి రఘునాథుణ్ణి చూసి చిరునవ్వు నవ్వి, "మహారాజా, ఈ దర్భాసనం మీద కూర్చో!'' అన్నాడు.

ఆ మాటకు అందరూ నిర్ఘాంతపోయారు. రఘునాథుడు మాత్రం సిగ్గుపడి తల వంచుకున్నాడు.

అందరికన్న ముందుగా సుబాల. "ఏం, స్వామీ? మా అబ్బాయిని మహారాజా అని పిలిచారేమిటి?" అని అడిగింది.

"అంతా చెబుతానమ్మా!...ఈ ఆశ్రమంలో మర్మాలకూ, రహస్యాలకూ తావు లేదు. ఇక్కడ మారువేషాలు పనికిరావు. అందుచేత నీ అసలు పేరు బయట పెట్టుకుని; నీ భార్యా పుత్రులను కూడా చూసుకోవచ్చు.'' అన్నాడు స్వామి రఘునాథుడితో.

తరవాత ఆయన మల్హారిరావుతో, "ఇతను సీతారామరాజు. తూర్పుబెంగాలులో ఉన్న భూషణ ఇతని రాజధాని, ముసల్మానులు కారణంగా ఇతను రాజ్యభ్రష్టుడయాడు. తన భార్యనూ, కొడుకునూ తన గురువువద్ద ఉంచి మారువేషంతో మహారాష్ట్ర దేశంలో చేరాడు." అన్నాడు.

ఈసంగతి తెలియక సీతారాంపట్ల తానేమైనా కూడని విధంగా ప్రవర్తించానేమో నని మల్హారిరావు నొచ్చుకున్నాడు. ఆయన క్షమాపణ చెప్పుతుంటే సీతారాం సిగ్గుపడి తల ఎత్తలేకపోయాడు.

సుబాల సంతోషానికి మేరలేదు. "స్వామీ, మీరు అబ్బాయి పూర్వవృత్తాంతమంతా యోగదృష్టితో తెలుసుకున్నారుగాదూ?" అన్నదామె.

"లేదమ్మా. జయంతి నాకంతా చెప్పింది." అన్నాడు స్వామి.

"ఆ దేవి ఇక్కడ ఉన్నదా? ఒక్కసారి ఆమె కాళ్ళమీద పడతాను." అన్నాడు సీతారాం ఆత్రంగా.

మల్హారిరావు ఆశ్చర్యంతో, "జయంతి నీకెలా తెలుసు?" అన్నాడు.

"జయంతిని నేను బాగా ఎరుగుదును. ఒకసారి ఆమె నన్నూ నా కుటుంబాన్నీ మృత్యువునుంచి కాపాడింది," అన్నాడు సీతారాం.

రామానందస్వామి సీతారాంతో, "నాయనా, ఇక నువు మారువేషంతో తిరగ నవసరంలేదు. నీ భార్యాపుత్రులను కలుసుకో. మహారాష్ట్రదేశం వెళ్ళి బాజీరావు కింద కొలువు చెయ్యనవసరం లేదు. జయంతిని చూడదలిస్తే ఈ ఆశ్రమంలోనే ఒక కుటీరంలో ఉండిపో. అర్ధరాత్రి నీ కామె దర్శన మవుతుంది." అన్నాడు.

ఆరాత్రి సీతారాం ఒక కుటీరంలో పడుకుని ఉండగా అక్కడికి జయంతి వచ్చింది. సీతారాం ఆమెకాళ్ళపైనపడి తన తప్పులను క్షమించమని వేడుకున్నాడు.

"మహారాజా, జరిగినదాని కింతగా చింతించ నవసరంలేదు. నేను దాన్ని ఎప్పుడో మరిచాను. నీ భవిష్యత్తు ఎలా ఉండబోయేదీ స్వామివారు తెలుసుకున్నారు. అందుచేత ఆయన చెప్పినట్టు చేస్తే నీకు శుభం చేకూరుతుంది " అన్నది జయంతి.

"ఆయనను చూసినప్పుడే నా జన్మ తరించింది. ఆయన ఏం చెయ్యమంటే అది చేస్తాను. కాని నిన్నొక్క విషయం అడగాలనుంది,"

"శ్రీని గురించి అడగాలని ! అవునా ? ఆమె నీకు కనిపించదు. ఆమె జీవించే ఉన్నది గాని, ఆమె జీవితం పూర్తిగా మారిపోయింది. ఈ లోకంలో మీ ఇద్దరికీ సంబంధం లేదు. మీ రిద్దరూ పరలోకంలోనే తిరిగి కలుసుకుంటారు."

"ఆమెను ఒక్కసారి చూడాలన్న ఆశ తప్ప ఆమెమీద నేను మరే ఆశా పెట్టుకోలేదు. ఈ ఒక్క ఆశా ఎంత తెంపుకున్నా తెగకుండా ఉంది."

"ఆమె రూపం నీ హృదయంలో నాటి ఉన్నట్టయితే దాన్ని చూసుకుని తృప్తి పడు. నీ జీవితపు ఆఖరు క్షణంలోనే ఆమె కనిపించేది," అంటూ జయంతి వెళ్ళిపోయింది.

# 10

స్వామివారి కోరికపై అందరూ ఆశ్రమంలోనే ఉంటున్నారు. శ్రీకూడా అదే ఆశ్రమంలో ఉన్నది. కాని సీతారాంకు ఒక్కసారి కూడా కనిపించలేదు. సుబాల మాత్రం తన "కోడలిని" చూసి, ఆమె సంగతంతా విన్నది. ఆమె తన "కొడుకు"తో ఆ సంగతే చెప్పలేదు.

ఏడెనిమిది రోజులు గడిచాయి. మల్హారిరావు రామానందస్వామివద్ద సెలవు తీసుకుని స్వదేశానికి తిరిగిపోతూ సీతారాంతో, "భాస్కర పండితుడు బెంగాలులోనే ఉన్నాడు. అతను నీకు పరమశత్రువన్న విషయం మరవవద్దు. మన స్నేహం తెగి పోగూడదు. తరచు ఉత్తరాలు రాస్తూ ఉండు," అన్నాడు.

తరవాత మూడు నాలుగు రోజులకు సీతారాం, సుబాళా, ఆమె భర్తా కాశీకి బయలుదేరి వెళ్ళారు. కృష్ణకమలుడు కూడా అక్కడికి వచ్చి చేరాడు. కాశీలో ఒక మాసం గడిపి సీతారాం, కృష్ణకమలుణ్ణీ, అచ్యుతకుమార మిశ్రుణ్ణీ వెంటబెట్టుకుని పాట్నాకు వెళ్ళాడు. సీతారాం పెద్దభార్య నందాదేవీ, చిన్నభార్య అయిన రమాదేవి కొడుకూ పాట్నాలో చంద్రచూడ తర్కాలంకారుడి వద్ద ఉంటున్నారు.

సీతారాం కొడుకైన రతికాంతుడికి చంద్రచూడుడు రాజోచిత విద్యలన్నీ

చక్కగా నేర్పాడు. ఆ కుర్రవాణ్ణి పాట్నా ప్రభువైన అలివర్దీఖాన్ వద్దకు తీసుకుపోయి అతడి పాండిత్యమంతా ప్రదర్శింపచేశాడు. అదివరకే చంద్రచూడుడు–అలివర్దీఖాన్ త్వరలోనే బెంగాలుకు రాజవుతాడని జోస్యం చెప్పి, అతని మైత్రి సంపాదించుకుని ఉన్నాడు. అలివర్దీఖాన్ రాజకుమారుణ్ణి చూసి సంతోషించి, అతన్ని మనసులో ఉంచుకుంటానని మాట ఇచ్చాడు. ఇంతలోనే చంద్రచూడుడి జోస్యం నిజమయింది––అలివర్దీఖాన్ బెంగాలు రాజును జయించి తానే బెంగాలుకు రాజయాడు. అది మొదలు అతనికి చంద్రచూడుడి పైన మరింత గురి కుదిరింది.

అలివర్దీఖాన్ బెంగాలుకు నవాబైనది మొదలు అతనికి మహారాష్ట్రులతో ఘర్షణ ఆరంభమయింది. అందుచేత ఎంతసేపూ యుద్ధపు గొడవనే తప్ప విశ్రాంతగా రాజ్యమేలుకునే అవకాశం లేకపోయింది.

సీతారాం పాట్నా చేరి నగరంలోకి వెళ్ళక, గంగాతీరాన్నే ఉండిపోయి, అచ్యుత కుమారుణ్ణి పంపి, చంద్రచూడుణ్ణి పిలిపించాడు. ఇప్పుడు చంద్రచూడుడు బాగా ముసలివాడు.

"రతికాంతుడికి అన్ని విద్యలూ నేర్పించాను. వాడంటే నవాబుక్కూడా చాలా ఇష్టం. ఏదో మంచి ఉపకారం చేస్తానన్నాడు. నువు వచ్చి నీ భార్యనూ, కొడుకునూ చూడవా?" అని చంద్రచూడుడు సీతారాంను అడిగాడు.

"నవాబిప్పు డెక్కడ ఉన్నాడు?"

"మహారాష్ట్రులు దండెత్తి వచ్చారు. నవాబు సైన్యం వెంట ఖాల్నాలో ఉన్నాడు. అక్కడ అతని సైనిక శిబిరం ఉంది."

"మహారాష్ట్రులకూ నవాబుకూ సఖ్యంచేద్దామనుకుంటున్నాను. లేకపోతే రెండు దేశాలకూ శాంతి వుండదు. బెంగాలు చాలా నష్టపోయింది. ఈ పని పూర్తి చేస్తేనేగాని నామనస్సింకోదాని పైకిపోదు. ఇది ముగించి, తరవాత సంసారకూపంలో దిగబడతాను."

"అ[illegible] అయితే నావెంట వచ్చి, నవాబుతోనే మాట్లాడు."

సీతారాం చంద్రచూడుణ్ణి వెంటబెట్టుకుని పాట్నానుంచి ఖాల్నాకువెళ్ళి నవాబును సందర్శించాడు. నవాబు సీతారాం పేరు అదివరకే విని ఉండటంచేత అతన్నిచూసి సంతోషించాడు.

సీతారాం తాను వచ్చినపని బయటపెడుతూ, "నవాబ్ బహాదుర్, ఇదివరకే బెంగాలు దాదాపు సర్వనాశనమై ఉన్నది. నేను చాలాకాలంగా బాజీరావు దగ్గిర సైన్యాధికారిగా ఉండి వచ్చాను. వారి శక్తిసామర్థ్యాలు నాకు పూర్తిగా తెలుసు. పీష్వా బాజీరావు అపార శక్తిమంతుడు, పరాక్రమశాలి, కార్యదీక్ష గలవాడు. మనపైకి వచ్చిన సేనకన్న వారి కింకా చాలా బలం ఉన్నది. యుద్ధం మనకు నష్టం. శత్రుపక్షాన మాట్లాడుతున్నా ననుకోకండి," అన్నాడు.

"ఇది మనం రేపెట్టిన యుద్ధం కాదుకదా! వాళ్ళే మనపైకి వచ్చారు," అన్నాడు నవాబు.

"క్షమించండి. వారు మనపైకి వచ్చారంటే అందుకు కారణం మనం కల్పించినదే గద!"

"అంటే మనం చౌథ్ ఇచ్చి తీరాలనా?"

"నిజానికి ఇవ్వనవసరంలేదు. కాని సమయం అనుకూలంగా లేనప్పుడు మనం ఓర్పు వహించాలి. ఎలాగో ఒకలాగా మనం సంధి చేసుకున్నామంటే, కొద్దికాలం దాటాక మనకీ పన్ను తప్పుతుందని నేను గట్టిగా చెప్పగలను."

"ఎలా?"

"పీష్వాకు నేనంటే చాలా ఆదరం. ఇప్పుడొచ్చిన గండగత్తర తొలిగిపోయాక నేను పీష్వావద్దకు వెళ్ళి అంతా చక్కబెడతాను. దేశక్షేమం కోసం నామాట కాస్త పాటించండి."

"ఏమిటి మీ సలహా?"

"ఏడాదికి ఆరు లక్షల పన్ను ఇచ్చేటట్టు సంధి చేసుకుందాం."

"సంధి ఎవరితో చేసుకుందాం?"

"తమరు అనుమతిస్తే నేనిప్పుడే సేనాధిపతి వద్దకు వెళ్ళి, సంధి ప్రయత్నాలు ప్రారంభమై యుద్ధం నిలిచిపోయేటట్టు చూస్తాను."

"ఈ సంధి నా కంతమంచిదిగా కనబడలేదు. అయినా మీ మాట తీసెయ్యటం నా కిష్టం లేదు. పీష్వాను మీరు ఒప్పించలేకపోతే యుద్ధం ఎలాగూ ఉండనే ఉంది. మీ ఇష్టం వచ్చినట్టు చెయ్యండి — నాకు సమ్మతమే."

సీతారాం చంద్రచూడుడితో సహా నవాబువద్ద సెలవుపుచ్చుకుని వచ్చేశాడు.

"నేను మహారాష్ట్ర సేనాని అయిన భాస్కరపండితుడితో మాట్లాడి వస్తాను. మీ రిక్కడే ఉంటారా? పాట్నాకు వెళతారా?" అన్నాడు సీతారాం

"ఇక్కడే ఉంటాను"

సీతారాంకు మల్హారిరావు చేసిన హెచ్చరిక జ్ఞాపకం వచ్చింది–భాస్కరపండితుడు తనకు పరమ శత్రువు; అటువంటివాడి వద్దకు ఒంటరిగా పోరాదు. కాని ఎవరినైనా తోడు తెచ్చుకునేటందుకు వ్యవధి లేదు. రేపే యుద్ధం ఆరంభం కానున్నది. మహారాష్ట్రులు గెలిస్తే బెంగాలుకు సర్వనాశనం తప్పదు. ఒకవేళ మహారాష్ట్రులు ఓడితే పీష్వా దృష్టిలో తాను కృతఘ్నుడవుతాడు. అందుచేత యుద్ధం ఆరంభం కాకుండా చూడాలి తన చేత ఖడ్గం ఉండనే ఉన్నది. మహారాష్ట్ర సైనికులు తన పట్ల మిత్రభావమే కలిగి ఉంటారు.

అందుచేత సీతారాం, అలివర్దీఖాన్ తరఫున సంధి సంభాషణలు జరిపటానికి ఒక రాయబారి వస్తున్నాడని భాస్కరపండితుడికి కబురు పంపాడు.

భాస్కరపండితుడు, ప్రచండుడు. రఘునాథ డా రాత్రి చావలేదనీ, కరమ్‌చంద్ దేశభ్రష్టుడయా డనీ, తనకూ అదేగతి పట్టనున్న దనీ ఆయన అదివరకే తెలుసుకున్నాడు. ఆయన చారులు సీతారాంకు సంబంధించిన విషయా లన్నీ ఎప్పటి కప్పుడు భాస్కర పండితుడికి చెబుతూనే ఉన్నారు. నవాబునుంచి రాయబారిగా వచ్చినవాడు తన శత్రువైన రఘునాథరాయలే నని ఆయనకు తెలుసు.

సంధ్యానుష్ఠానాలలో ఉన్నా ననీ ఒక గడియ అనంతరం రావచ్చు ననీ భాస్కర పండితుడు సీతారాంకు జవాబు పంపి అతన్ని చంపే సేటందుకు తగిన ఏర్పాట్లు చేశాడు

సీతారాం వచ్చి అడిగితే, సైన్యాధిపతి అక్కడ ఉన్నాడని ఒక గుడారాన్ని సైనికులు చూపారు అంతలోనే ఆగుడారం నుంచి ఒక భటుడు వచ్చి "మా ప్రభువు గారు మీ కోసం ఎదురు చూస్తున్నారు. దయచెయ్యండి" అని సీతారాంను ఆహ్వానించాడు.

సీతారాం లోపలికి వెళ్ళి నమస్కారంచేసి. "అయ్యా–" అంటుండగానే

భాస్కరపండితుడు. "ఛీ, దుర్మార్గుడా! మేం పైకి రాకుండా అడ్డుపడటంతో పోనిక మమ్మల్ని నాశనం చేస్తావా? చావు!" అంటూ కత్తి ఎత్తి సీతారాంను కొట్టాడు.

సీతారాం ఒరనుంచి కత్తిదూసే లోపల అతని శరీరమంతా గాయాలతో నిండిపోయింది. సీతారాం కత్తి విసిరాడు. దాని మూలంగా భాస్కరపండితుడి వక్షంలో కొద్దిగాయ మయింది సీతారాం తిరిగి కత్తివిసిరేలోపుగా అతనికి స్పృహ తప్పిపోయింది. రక్తస్రావంవల్ల స్పృహతప్పి పడిపోయిన సీతారాం తల నరికెయ్యటానికి భాస్కరపండితుడు ముందుకు వచ్చేటంతలో ఏదో పిడలాగా అతనికి అడ్డొచ్చింది. భాస్కరపండితుడు ఆశ్చర్యంతో చూసేసరికి త్రిశూలధారిణి అయిన కాళీమూర్తి అవతారం అతనికి కంట పడింది. అంతలో ఎవరో వెనుక నుంచి భాస్కరపండితుడి మెడ నరికేశాడు.

దేవీమూర్తి ఒక్కసారి సీతారాంకేసి చూస్తూ నిలబడింది. అతను కళ్ళు తెరిచి ఆ మూర్తికేసి చూశాడు. అతనికంట అశ్రువులు నిండాయి. అతనేదో అనబోయాడు. గాని మాటరాలేదు. అతికష్టం మీద. "కనిపించావు." అని అతను ప్రాణాలు వదిలాడు.

ఆ దేవీమూర్తి ఒక్క నిశ్వాసం విడిచి అక్కడినుంచి వెళ్ళిపోయింది.

• క్షణాలమీద ఈ వార్త శిబిరమంతటా పాకింది. అందరూ భాస్కర పండితుణ్ణి వెదకిట్టారు

మర్నాడు పొద్దుటికి సీతారాం శవాన్ని గంగాతీరానికి చేర్చారు. శవంవెంట చాలామంది వచ్చారు. వారిలో శ్రీ, జయంతు లిద్దరూ ఉన్నారు.

శ్రీ, చంద్రచూడుడి కాళ్ళకు నమస్కారంచేసి, "ఈ జన్మలో నా భర్తకు ఒక్కనాడైనా సేవచేయటానికి నోచుకోలేదు. నా భర్తవెంట వెళ్ళిపోవటానికి నాకు అనుమతి ఇవ్వండి." అన్నది.


"అమ్మా, నువ్వు మామూలు స్త్రీవికావు, దేవివి, నీ కష్టం చెప్పటానికి నేనెవణ్ణి?" అంటూ చంద్రచూడుడు కంటనీరు పెట్టుకున్నాడు.

శ్రీ, జయంతి పాదాలకు నమస్కారంచేసి, సెలవు తీసుకుని, సీతారాం పాదాలు తాకి, అతని పక్కనే చితిపైన పడుకున్నది. చూస్తూండగానే అగ్నిహోత్రుడు ఆ ఇద్దరినీ పిడికెడు బూడిద చేసేశా.

* * * * *

చంద్రచూడుడు పాట్నాకు వెళ్ళి నందాదేవినీ, రాజకుమారుణ్ణీ గంగాతీరానికి తీసుకువచ్చి, యథావిధిగా సీతారాంకు శ్రాద్ధక్రియలు జరిపించాడు.

అలివర్దీఖాన్ రాజకుమారుడికి భూషణనగరాన్ని జాగీరుగా ఇచ్చేశాడు. మహమ్మదుపుర సింహాసనంమీద ఇంతకాలానికి మళ్ళీ రతికాంతుడు కూర్చున్నాడు. రాజ్యాభిషేకాన్ని చంద్రచూడుడు స్వయంగా జరిపించి, రాజగురువుగా ఉండిపోయాడు. సుబాలా, ఆమెభర్తా భూషణ నగరంలో కాపరం పెట్టారు.



అలివర్దీఖాన్ రాజ్యం విస్తరించింది. అతను చాలా మంచివాడు. హిందూ ముసల్మానుల మధ్య అతను సఖ్యత సాధించాడు.

కాల్నావద్ద, గంగాతీరాన సీతారాం దహనక్రియ జరిగినచోట, రతికాంతుడు ఒక దేవాలయాన్నీ, ధర్మశాలనూ నిర్మించాడు. కాలక్రమాన ఆ రెండూ గంగలో కూలిపోయాయి. ఇప్పుడు వాటి జాడ కూడా కనబడదు.